www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
12 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 217

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## నిషేధిత భూములపై ఆందోళన వద్దు

- 22-A భూములపై అపోహలు వద్దు: మంత్రి పొంగులేటి
- అర్హులందరికీ న్యాయం: రెవెన్యూ శాఖ భరోసా
- కొత్తగా ఎలాంటి భూములు చేర్చలేదు: ప్రభుత్వం స్పష్టీకరణ
- ఈనెల 14 లోగా అన్ని డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్: సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రజా కోణంలో నిర్ణయాలు





03



## ప్లాస్టిక్ నోట్లు వచ్చేస్తున్నాయ్..!

- రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్ల ముద్రణకు కేంద్రం ఆమోదం
- చెరో 100 కోట్ల నోట్లతో క్షేత్రస్థాయి పరిశీలన
- పేపర్ నోట్లు యథావిధిగా చలామణిలో ఉంటాయి
- సాధారణ నోట్ల కంటే 2.5 నుంచి 4 రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి
- నీటిలో తడిచినా, మురికి పట్టినా చెడిపోవు
- ప్రత్యేక సెక్యూరిటీ ఫీచర్లతో నకిలీల ఏరివేత సులభం

03



## రూ. 200 కోట్ల భూమి.. రేవంత్ తమ్ముడికి రూ. 7 కోట్లకే!

### సీఎం బంధువులకు వేల కోట్ల కాంట్రాక్టులు

- రేవంత్ సోదరుడికి రూ. 200 కోట్ల భూమిని రూ. 7 కోట్లకే
- ఉద్యోగులు లేని, లక్ష మూలధన సంస్థకే కేటాయింపు
- వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్ '12345678' అని ఉంది
- కుంభకోణాన్ని శ్రీధర్ బాబు కప్పిపుచ్చుతున్నారు
- భూ దోపిడీపై బీఆర్ఎస్ పోరాటం ఆగదు

03

## జాబ్ క్యాలెండర్ ఏమైంది రాహుల్?



- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- అమిత్ షా సిద్ధంగా ఉన్నా రాహుల్ చర్చకు రావట్లేదు
- విద్యార్థులపై దాడులపై రాహుల్ ఎందుకు స్పందించడం లేదు?
- రేవంత్ రెడ్డి లాఠీచార్జీల విషయంలో డబుల్ స్టాండర్డ్స్
- హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైంది
- జార్ఖండ్ విద్యార్థుల పోరాటానికి బీజేపీ మద్దతు

02

రాజ్యాంగబద్ధంగా పన్నుల వాటాను చెల్లిస్తున్నప్పుడు ప్రాంతీయ అవసరాలు ప్రాజెక్టుల వద్దకు వచ్చేసరికి కేంద్రం వివక్ష చూపుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతపు కరువు జిల్లాల ప్రజల నిరసన ఢిల్లీ పీఠాన్ని నిలదీస్తున్న తెలంగాణ ఆవేదనగా మారింది. దశాబ్దాలుగా ఎండిపోతున్న మహబూబ్‌నగర్ రంగారెడ్డి నల్లగొండ భూములకు జీవం పోసే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా నిరాకరించడం కేవలం సాంకేతిక అంశం కాదు. ఇది సుదీర్ఘకాలంగా కరువుతో నలిగిపోతున్న ప్రజల న్యాయమైన సాగునీటి హక్కులను కాలరాయడమే. తెలంగాణ రాష్ట్రం కేవలం పన్నులు వసూలు చేసే ఏటీఎంలా మారిందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హోదా లేదు నిధులు ఇవ్వరాయే అంటూ గళమెత్తుతున్నారు. ప్రతీ ఏటా వేల కోట్ల రూపాయల ఆదాయం కేంద్ర ఖజానాకు చేరుతున్నప్పటికీ తెలంగాణ దాహార్తిని తీర్చే కీలక ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే ప్రసక్తే లేదని కేంద్రం ప్రకటించడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



# తెలంగాణ గోడు వినరా?

- పాలమూరుకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వట్లేదు
- ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులకే నిధులిస్తూ వివక్ష చూపుతోంది
- నిబంధనల పేరుతో కావాలనే కొర్రీలు పెడుతోంది
- హోదా లేక రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల భారం పడుతోంది
- కేంద్రంపై ఒత్తిడి తేవడంలో అందరూ విఫలమయ్యారు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసికట్టుగా పోరాడాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల మీద స్వచ్ఛమైన ప్రేమ కురిపిస్తూ అక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పిస్తూ భారీగా నిధులు కేటాయిస్తోంది. ఉత్తరాదిలోని కేన్ బెత్వా లింక్ ప్రాజెక్టుకు రూ. 44,605 కోట్ల వ్యయంలో ఏకంగా 90శాతం నిధులు భరించేందుకు ఆమోదం తెలిపింది. కర్ణాటక ఎన్నికల లబ్ధి కోసం అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ. 5,300 కోట్ల ప్రత్యేక గ్రాంట్‌ను ప్రకటించింది. మిగతా 2లో..



## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- అక్కడికక్కడే ఐదుగురు మృతి
- మరికొంత మంది పరిస్థితి విషమం
- కోహీర్ వద్ద డివైడర్ ను ఢీకొని పల్టీ కొట్టిన కారు, ఇద్దరు మృతి

03



## ఢిల్లీలో హైఅలర్ట్!

- స్వాతంత్ర్య దినోత్సవం వేళ దేశంలో ఉగ్ర ముప్పు
- ఐఎస్ఐ కుట్రలపై నిఘా వర్గాల నిఘా
- పశ్చిమ సరిహద్దులో 'ఆపరేషన్ అలర్ట్' చేపట్టిన బీఎస్ఎఫ్

02



## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

- అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు

02

# ఒకటి రెడ్డికి, ఒకటి బీసీకి!

- మార్చిలో జరిగే రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ దృష్టి
- ఆరు జిల్లాల ఎన్నికలను కాంగ్రెస్ సవాలుగా తీసుకుంది
- ఒకచోట రెడ్డి, మరోచోట బీసీ అభ్యర్థికి అవకాశం
- రెండు స్థానాలకు పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నాయి
- 14 లక్షల ఓటర్లున్న ఈ ఎన్నికల్లో గెలుపు కీలకం
- సంక్షేమ పథకాలతో విజయం సాధించాలని ప్రణాళిక




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే తీవ్ర కసరత్తు ప్రారంభించింది. ఈ రెండు స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ గెలుచుకోవాలని ఆ పార్టీ పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా మంత్రులకు ప్రత్యేక మిగతా 2లో..



## అసలు.. నా ఫోనే ఎత్తుతలేరు!

- రేవంత్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే పోచారం తీవ్ర అసంతృప్తి
- సీఎం ఆదేశాలు, నిధులు మంజూరు చేయట్లేదు
- ప్రజాప్రతినిధుల కాల్స్ లిఫ్ట్ చేయడం లేదు
- సొంత ప్రభుత్వంలోనే నిధుల కొరత
- ప్రభుత్వంలో పట్టు లేదని అనుమానం
- సొంత నేత బహిరంగ విమర్శలు సంచలనం

02

## పాతబస్తీ మెట్రోకు గ్రీన్ సిగ్నల్

- ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట 7.5 కి.మీ పనులు వేగవంతం చేయాలి
- పెండింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఆధునిక సాంకేతికతతో పాటు చారిత్రక కట్టడాలకు రక్షణ
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు కొత్త కోచ్‌ల కొనుగోలు
- నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం
- మెట్రో ఎండీతో సమావేశమై ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని నిర్ణయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ మెట్రో విస్తరణలో కీలకమైన పాతబస్తీ కారిడార్ పనుల్లో కదలిక వచ్చింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల మెట్రో మార్గం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో పాతబస్తీ మెట్రోతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. పాతబస్తీ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రద్దీ ప్రాంతాల్లో మెట్రో నిర్మాణం అత్యంత క్లిష్టమైనప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తూ పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను మిగతా 3లో..




## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్

### 450 లగ్జరీ ఫ్లాట్లు, స్కై బ్రిడ్జ్, 240 మీటర్ల ఎత్తు

- కోకాపేటలో 4 ఎకరాల్లో 65 అంతస్తులతో ట్విన్ టవర్ల నిర్మాణం
- ట్రంప్, ట్రిబెకా, ఐరా రియాల్టీ సంయుక్త ప్రాజెక్ట్
- ఫ్లాట్ ధర రూ. 5 కోట్ల నుంచి, పెంట్‌హౌస్ రూ. 62 కోట్ల వరకు
- ప్రాజెక్ట్ ద్వారా రూ. 3500-4200 కోట్ల ఆదాయ అంచనా
- గడువు 3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

03

# ఒకటి రెడ్డికి, ఒకటి బీసీకి!

మొదటిపేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించి గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలను కలిపి ఒక స్థానం ఉండగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు కలిపి మరో స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఆరు జిల్లాల పరిధిలోని 77 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 14 లక్షల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలోని సగానికి పైగా అసెంబ్లీ స్థానాలతో ముడిపడి ఉండటంతో కాంగ్రెస్ పార్టీ దీనిని మినీ అసెంబ్లీ ఎన్నికగా భావిస్తోంది. పార్టీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తు రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని నేతలు గట్టిగా విశ్వసిస్తున్నారు కాబట్టి సరైన వ్యూహాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ సూత్రం ప్రకారం ఒక నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇస్తే మరో చోట బీసీ వర్గానికి చెందిన నాయకుడిని బరిలోకి దింపాలని ప్రాథమికంగా నిర్ణయించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గం నుంచి ప్రధానంగా ముగ్గురు ఆశావహుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వారంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేర్లను పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. అయితే గుత్తా అమిత్ రెడ్డి పోటీకి పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. తన తండ్రి గుత్తా సుఖేందర్‌రెడ్డి పదవీ కాలం ముగిసిన తర్వాత తిరిగి ఆయనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. దీంతో ఈ స్థానంలో కొత్త వారికి కూడా ఏదైనా మంచి అవకాశం ఖచ్చితంగా దక్కుతుందేమో వేచి చూడాల్సిన అవసరం ఉంది. మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి ప్రధానంగా నలుగురి పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. ఇందులో పీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్‌రెడ్డి, గాలి హర్షవర్ధన్ రెడ్డి, జక్కిడి శివచరణ్‌రెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కాగా గౌరి సతీష్ బీసీ వర్గానికి చెందిన నేత. విద్యాసంస్థల యాజమాన్యాల సంఘంలో గతంలో కీలక పాత్ర పోషించిన సతీష్‌కు గ్రాడ్యుయేట్ ఓటర్లను సులభంగా ఆకర్షించే సత్తా ఉందన్న బలమైన వాదన పార్టీలో వినిపిస్తోంది. అలాగే జక్కిడి శివచరణ్ రెడ్డిపై ఇటీవల కొన్ని ఆరోపణలు వచ్చినప్పటికీ విద్యార్థులతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా పని చేసిన అనుభవంతో పాటు ఆర్థికంగా అత్యంత బలంగా ఉండటం ఆయనకు బాగా కలిసి వచ్చే ప్రధాన అంశంగా నాయకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలోని వివిధ సామాజిక సమీకరణాలను బట్టి చివరకు ఎవరికి ఎక్కడ ఏ రకమైన అవకాశం లభిస్తుందన్నది సర్వత్రా తీవ్రమైన ఉత్కంఠ రేపుతూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ అంశంగా ప్రస్తుతం మారింది. ఈ ఆరు జిల్లాల పరిధిలో కాంగ్రెస్ పార్టీకి 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిపి మొత్తం 10 మంది మంత్రులు ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చీఫ్ విప్, ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా ఈ జిల్లాలకు చెందిన వారే. అధికారంలో ఉండి ఇంత పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేక పోతే పార్టీకి తీవ్రమైన అప్రతిష్ఠ వస్తుందని అధిష్ఠానం గట్టిగా భావిస్తోంది. అందుకే అభ్యర్థుల గెలుపు బాధ్యతలను స్థానిక మంత్రులకు, ఎమ్మెల్యేలకు అత్యంత కీలకంగా మార్చింది. నిరుద్యోగ సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వివాదాలు, జాబ్ నోటిఫికేషన్లపై వస్తున్న విమర్శలను ఎలా ఎదుర్కొని ఓటర్లను తమ వైపు తిప్పుకుంటారన్నది ఇప్పుడు పార్టీ ముందున్న అతిపెద్ద సవాలు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు ఒక స్పష్టమైన గీటురాయిగా మారనున్నందున కాంగ్రెస్ నాయకులంతా మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ నిత్యం ఎన్నో రకాల పక్కా రాజకీయ వ్యూహాలు జాగ్రత్తగా కలిసికట్టుగా రచిస్తున్నారు అని రాజకీయ వర్గాల్లో జోరుగా వినపడుతోంది. త్వరలోనే ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం నుంచి అధికారిక నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. వారితో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించారు. సీనియర్ నేతలు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ కూడా పూర్తిస్థాయిలో సమన్వయం చేస్తూ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తున్నారు. విద్యావంతులైన గ్రాడ్యుయేట్ ఓటర్లను తమ వైపు తిప్పుకుని ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అగ్నిపరీక్షగా మారింది. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి ఓట్లను రాబట్టేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నాయి. అన్ని వర్గాల మద్దతు కూడగట్టి ప్రతిపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చాలా బలంగా ఆశిస్తున్నాయి కాబట్టే రోజువారీ కార్యక్రమాలను సైతం పక్కనబెట్టి ముఖ్య నేతలంతా ఈ కీలకమైన ఎన్నికల సన్నద్ధతపైనే తమ దృష్టిని పూర్తిగా కేంద్రీకరించారు.




# జాబ్ క్యాలెండర్ ఏమైంది రాహుల్?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాహుల్ గాంధీ అశోక్ నగర్‌లో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఏమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ నిరసనలపై కేంద్ర హోంమంత్రి పార్లమెంటుకు వచ్చి ప్రకటన చేస్తామంటే రాహుల్ ఎందుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. జార్ఖండ్ ఘటనపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాహుల్ లోక్ సభకొస్తే అన్ని ప్రశ్నలకు అమిత్ షా జవాబిస్తారని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గారు తెలంగాణకు రండి. అశోక్ నగర్ లో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఏది. మీ జాబ్ క్యాలెండర్ ఎక్కడ పోయింది. ఎక్కడ పోయినయ్ మీ రెండు లక్షల ఉద్యోగాలు. ఎక్కడ పోయినయ్ మీ ఫీ రీయింబర్స్ మెంట్. మా నాయకులు ఇప్పటికీ నాలుగు లక్షల సంతకాలు తీసుకున్నారు. వాళ్ల మీద లాఠీచార్జ్ చేశారు. రేవంత్ రెడ్డి అక్కడ లాఠీచార్జ్ ను వ్యతిరేకిస్తాడు. ఇక్కడేమో లాఠీచార్జ్ చేయిస్తాడు. ఇదేం పద్ధతి అని మండిపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ నిరసనను చూశాం. ఆ నిరసనలో తొంభై శాతం మంది బయటి వాళ్లే ఉన్నారు. వారు దేశానికి వ్యతిరేకంగా స్లోగన్స్ ఇచ్చారు. జార్ఖండ్ లో నిరసన తెలుపుతున్న వాళ్లలో అందరూ స్టూడెంట్స్ ఉన్నారు. ఇక్కడ కూడా బయటి వాళ్లు లేరు. ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదు అక్కడ. విద్యార్థి నాయకుడి ఆరోగ్య పరిస్థితి బాలేకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఖండించలేదు. స్పందించలేదు. సోనమ్ వాంగ్ చుక్, నడ్డా గారు వెళ్లి మాట్లాడారు. జార్ఖండ్ విద్యార్థులు సీరియస్ గా కొట్లాడుతున్నారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను సీబీఐకు అప్పజెప్పమంటే ఎందుకు అప్పజెప్త లేరు. రాహుల్ గాంధీ ఎందుకు పోవడం లేదు అక్కడికి. జార్ఖండ్ ప్రభుత్వం స్పందిస్తలేదు. నాన్ స్టూడెంట్స్ గురించి మాట్లాడుతవ్. కానీ రియల్ స్టూడెంట్స్ గురించి మాట్లాడవా. పోలీసులు కింద వైర్లు వేయడంతో విద్యార్థుల కాళ్లకు రక్తాలు కారుతున్నాయి. లాఠీచార్జ్ చేస్తున్నారు. రబ్బర్ బుల్లెట్లు కొడుతున్నారు. నాన్ స్టూడెంట్స్ గురించి రాహుల్ గాంధీ మాట్లాడుతారు. కానీ జార్ఖండ్ విద్యార్థుల గురించి ఎందుకు మాట్లాడరు. అసలైన విద్యార్థుల సమస్యల మీద రాహుల్ ఎందుకు సైలెంట్ అయ్యారు. ధర్మేంద్ర ప్రధాన్ ను రిజైన్ చేయమన్నారు. చేశారు. ఫైరింగ్ ఎవరు చేశారో చెప్పాలని ఇప్పుడు అంటున్నరు. అది కూడా చెప్పడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారు. మీరు పార్లమెంటుకు ఎందుకు వస్తలేరు మరి. రాహుల్ పార్లమెంటుకు రాకుండా తప్పించుకుంటున్నారు. ఆయనకు సబ్జెక్టు లేనట్టుంది పాపం. అది లేక ఆయన అటెండ్ అయితలేరు. నీట్ పేపర్ లీకేజీ మీద చట్టం కూడా తెచ్చాం. కేంద్ర హోంమంత్రి స్టేట్ మెంట్ ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. దానికి కూడా సహకరించడం లేదు. రాహుల్ గాంధీ మీరు పార్లమెంటుకు రండి. పారిపోకండి. హోం మినిస్టర్ ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తారు. అంతా పార్లమెంట్ హాల్ లో ఉంటుంది. రోడ్ల మీద డ్రామాలు ఉండవు. జార్ఖండ్ విద్యార్థుల మీద జరుగుతున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నం. విద్యార్థులకు ఎందుకు మద్దతు పలకడం లేదు. దేశాన్ని ఒక దిశలో తీసుకుపోయేలా విద్యార్థులు కొట్లాడుతున్నారు. తెలంగాణల కూడా పేపర్లు లీకైనయ్. ఇక్కడ కూడా ప్రభుత్వం పట్టించుకుంటలే. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి తోసేసి రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. వారికి న్యాయం చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఎందుకొస్తలేరని ప్రజలు అడుగుతున్నరు. అయ్యా రాహుల్ పార్లమెంటుకు రండి. మీకున్న నాలెడ్జ్ తో మాట్లాడండి. లేకపోతే ఎవరినైనా అడిగి మాట్లాడండి. అంతేగానీ పార్లమెంట్ నుంచి పారిపోతా అంటే ఎట్లా అండి. మీరు సమాధానం చెప్పాలని బీజేపీతో పాటు దేశ ప్రజలు అడుగుతున్నారు. రాహుల్ తీరును, రేవంత్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండిస్తున్నం. జార్ఖండ్ విద్యార్థులకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నం అని రాంచందర్ రావు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నిరుద్యోగులను మోసం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య యుద్ధాలు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటోందని రాంచందర్ రావు తెలిపారు. పార్లమెంటు వేదికగా అన్ని అంశాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. విపక్షాలు చర్చకు రాకుండా కేవలం రాజకీయం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. దేశ భద్రతకు, విద్యార్థుల భవిష్యత్తుకు బీజేపీ కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. జార్ఖండ్ లోని విద్యార్థుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. వారికి తక్షణన్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

**విశాలభారతి, తెలంగాణ బ్యూరో:**

అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారని అధికారులు వెల్లడించారు.



# తెలంగాణ గోడు వినరా?

మొదటిపేజీ తరువాయి

అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును విభజన చట్టం నెపంతో 100శాతం కేంద్ర నిధులతో నిర్మించే బాధ్యతను తన భుజాన వేసుకుంది. కానీ శతాబ్దాలుగా కరువుతో అల్లాడుతున్న మహబూబ్‌నగర్ రంగారెడ్డి నల్లగొండ జిల్లాల దాహార్తిని తీర్చే సుమారు రూ. 55,000 కోట్ల పాలమూరు ఎత్తిపోతల పథకం దగ్గరకు వచ్చేసరికి మాత్రం ట్రిబ్యునల్ పరిధిలో నీటి కేటాయింపులు తేలలేదంటూ మెలికలు పెడుతోంది. పొరుగు రాష్ట్రాలకు నిధుల వర్షం కురిపిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణపై శీతకన్ను వేయడం కేంద్ర ప్రభుత్వం అనైతికతకు నిదర్శనంగా నిలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కడం వెనుక కేంద్రం చూపిన ప్రత్యేక రాజకీయ చొరవే ప్రధాన కారణమైంది. ముంపునకు గురయ్యే తెలంగాణలోని 7 మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపకపోతే అసలు పోలవరానికి మనుగడ ఉండేది కాదు. అప్పుడు తెలంగాణ ప్రజలు ఎంత మొత్తుకున్నా వినకుండా ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత వేగంగా ఆర్డినెన్స్ తెచ్చి ఆ మండలాలను ఏపీకి కట్టబెట్టింది. రాజకీయ అవసరాల కోసం ఏకంగా రాష్ట్రాల సరిహద్దులను రాజ్యాంగ చట్టాలనే సవరించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నష్టం జరుగుతుందని తెలిసినా ఏపీ ప్రాజెక్టుకు మార్గం సుగమం చేసింది. కానీ అదే తెలంగాణ ప్రాజెక్టుల విషయానికి వచ్చేసరికి హఠాత్తుగా చట్టాలు ట్రిబ్యునల్ వివాదాలు అంటూ లీగల్ మెలికలు పెట్టడం రాజకీయ డ్రామాగా కనిపిస్తోంది. నిజంగానే సాంకేతిక సమస్యలు అడ్డొస్తుంటే కేంద్రం చొరవ తీసుకుని ఒకే ఒక్క ఉన్నత స్థాయి సమావేశంలో ఆ సమస్యలేంటో తేల్చి చెప్పలేదా అనే ప్రశ్న ఉదయిస్తోంది. జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు లభిస్తే ప్రాజెక్ట్ వ్యయంలో 60శాతం నుండి 90శాతం వరకు నిధులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. హోదా దక్కకపోవడం వల్ల తెలంగాణ ఖజానాపై నేరుగా రూ. 30,000 కోట్ల నుండి రూ. 40,000 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతోంది. దేశంలోనే అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ తన సొంత సాగునీటి ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్ల ద్వారా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బడ్జెట్‌ను కుదేలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పాలమూరు ఎత్తిపోతల జాతీయ హోదా తిరస్కరణపై ఢిల్లీ పీఠంపై సమరశంఖం పూరించాల్సిన స్థానిక పార్టీలు దాన్ని పక్కనబెట్టి పరస్పరం నిందారోపణలకే ప్రాధాన్యమిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై తగిన స్థాయిలో ఒత్తిడి పెంచడంలో విఫలమైంది. బిఆర్ఎస్ ప్రతిపక్షంగా కేవలం విమర్శలు చేస్తూ బాధ్యత నుంచి తప్పుకుంటోందే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరచడంలో విఫలమైంది. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రయోజనాల విషయంలో కనీసం నోరు విప్పకపోవడం ప్రధాన లోపంగా మారింది. తమిళనాడులో అక్కడి అధికార ప్రతిపక్ష పార్టీలు తమలో తాము ఎంత తీవ్రంగా కొట్లాడుకున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలు వచ్చేసరికి రాజకీయ వైరివర్గాలను పక్కనబెట్టి ఒకే తాటిపైకి వస్తాయి. తమిళ తంబీల వలె రాష్ట్ర ప్రయోజనాల కోసం స్వార్థ రాజకీయాలను అధిష్టాన భయాన్ని పక్కనబెట్టి ఐక్యపోరాటం చేయకపోవడం వల్లే ఢిల్లీ పెద్దలు తెలంగాణ డిమాండ్లను తేలిగ్గా తీసుకుంటున్నారనే నిరసన క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు ప్రాజెక్టులనేవి ఓట్ల రాజకీయాలకు ఎన్నికల సమీకరణాలకు ఉపయోగపడే సాధనాలు కావచ్చు. కానీ పాలమూరు ప్రజలకు ఈ పథకం జీవన్మరణ సమస్యగా ఉంది. మనసుంటే మార్గం ఉంటుందనే నిజానికి పోలవరం కోసం తెచ్చిన ఆర్డినెన్సే నిదర్శనమైతే రాజకీయ కోణం ఉంటే సాకులు వేలల్లో ఉంటాయనడానికి పాలమూరు విషయంలో ఎన్డీఏ ప్రభుత్వ వైఖరే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.





# ఢిల్లీలో హైఅలర్ట్!

**విశాలభారతి, న్యూఢిల్లీ, :**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ , బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీ, జమ్మూకాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నదని 'ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)' అధికారి ఒకరు తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూకాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 'ఆపరేషన్ అలర్ట్' ను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌ను బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా, పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమబెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 'సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)' యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది.

# అసలు.. నా ఫోనే ఎత్తుతలేరు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మరోసారి తిరుగుబాటు చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మంత్రులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. కేవలం ఆరు నెలల్లోనే బాన్సువాడలో పెండింగ్ లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని సీఎం స్వయంగా హామీ ఇవ్వడం వల్లే తాను పార్టీ మారాను. అయితే ముఖ్యమంత్రి ఇస్తున్న ఆదేశాలను రాష్ట్రంలోని మంత్రులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పోచారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం స్వయంగా నిధులు మంజూరు చేయాలని మంత్రులకు సూచించినా వారు పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వంలో అసలు పట్టు ఉందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు ప్రజాప్రతినిధుల ఫోన్లను కనీసం లిఫ్ట్ చేయడం లేదని పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి తాను యాభై సార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించలేదని ఆయన విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను ఖాతరు చేయడం లేదని ఆరోపించారు. గతంలో రాజకీయ పరిణామాల కారణంగా కొంతమంది చేసిన తప్పిదాల వల్లే తాను పార్టీ మారవలసి వచ్చిందని వివరించారు. సొంత పార్టీ ప్రభుత్వంలోనే నిధుల విడుదల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన వాపోయారు. మంత్రుల తీరు వల్ల నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి మంత్రుల వరకు ఎక్కడా సరైన స్పందన లభించడం లేదని ఆయన తెలిపారు. ఐదు నెలల క్రితం కూడా సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల కోసం పోచారం ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. నిధులు మంజూరు చేయకపోతే తాను ఈ వయసులో మంత్రుల కాళ్ళు మొక్కాలా అని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఒక మంత్రికి ఇరవై సార్లు చెప్పినా పనులు జరగలేదని గతంలో ఆయన నిరసన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్ద ఉన్నే జీవోలు వచ్చేవని ఆయన గుర్తు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు ఇచ్చిన మాట తప్పారని ఆయన గతంలోనే బాహాటంగా విమర్శించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ఎత్తని దుస్థితి నెలకొందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అసలు పనిచేస్తుందా లేదా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరవై ఇరవై నాలుగు జూన్ ఇరవై ఒకటో తేదీన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పోచారం నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో పోచారంతో పాటు ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డికి కూడా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో కేసీఆర్ మంత్రివర్గంలో పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత రెండు వేల పద్దెనిమిది ఎన్నికల్లో బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది శాసనసభ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. రెండు వేల ఇరవై మూడు ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ తరఫున విజయం సాధించి శాసనసభ్యుడిగా నిలిచారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెండు వేల ఇరవై నాలుగులో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యే ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. బాన్సువాడ నియోజకవర్గ ప్రజల ఆశలను వమ్ము చేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం మాటలను ధిక్కరిస్తున్న మంత్రులపై అధిష్టానం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పరోక్షంగా కోరారు. సీనియర్ నాయకుడైన పోచారం అసంతృప్తి పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఈ పరిణామాలు ఎలాంటి రాజకీయ మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి ఈ వివాదం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పోచారం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. మంత్రుల తీరుపై ఆయన చేసిన విమర్శలు పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ముఖ్యమంత్రి ఈ అంశంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గతంలో జరిగిన పరిణామాలు అన్నీ ఇప్పుడు మరోసారి తెరపైకి వస్తున్నాయి. నాయకుల మధ్య సమన్వయం లోపించడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రభుత్వ పెద్దలు వెంటనే జోక్యం చేసుకుని ఈ వివాదానికి తెరదించాలి. లేకపోతే రాబోయే రోజుల్లో పార్టీకి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పోచారం అనుభవం దృష్ట్యా ఆయన ఆవేదనను తేలికగా తీసుకోవడానికి వీలులేదు. సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో వేచి చూడాలి. ఏది ఏమైనప్పటికీ సొంత పార్టీ నాయకుడే ఇలా బహిరంగంగా గళం విప్పడం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. రాబోయే రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి. అందరి దృష్టి ఇప్పుడు బాన్సువాడ రాజకీయాలపైనే కేంద్రీకృతమైంది. ఈ పరిణామాలు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బయటపెడుతున్నాయి. ముఖ్యమంత్రి ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారనే ఉత్కంఠ నెలకొంది. పార్టీ పెద్దలు బాధ్యులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీనియర్ నాయకుడు చేస్తున్న ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.



GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# పాతబస్తీ మెట్రోకు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

పరిగణలోకి తీసుకుంటూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మెట్రో కారిడార్‌కు సంబంధించిన పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు మెట్రో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ భూసేకరణ టెండర్ల ప్రక్రియలను సమన్వయం చేసుకుంటూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాతబస్తీలో రోడ్లు ఇరుకుగా ఉండటం వల్ల భూసేకరణ చాలా కీలకంగా మారింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి నష్టపోయిన వారికి తగిన పరిహారం అందేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిపుణుల కమిటీ పర్యవేక్షణలో పనులు జరగాలని నిర్ణయించారు. పాతబస్తీ ప్రాంతానికి మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే అక్కడి ప్రజలకు ప్రజా రవాణా మరింత సులభతరం కావడంతో పాటు నగరంలోని ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాతబస్తీ కారిడార్ నిర్మాణంలో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించి అవసరమైన సాంకేతిక సలహాలు సూచనలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంతో పాటు నిర్మాణం నిర్వహణ ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చారిత్రక కట్టడాలకు ఎలాంటి



నష్టం వాటిల్ల విధంగా మెట్రో అలైన్‌మెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచించారు. పాతబస్తీలో మెట్రో రైలు పరుగులు పెడితే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు వేగంగా విస్తరించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వం దృఢంగా విశ్వసిస్తోంది. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైళ్లలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న రైళ్ల సామర్థ్యానికి అదనంగా కొత్త కోచ్‌లను కొనుగోలు చేసి వాటిని మెట్రో రైళ్లకు జత చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. పీక్ అవర్స్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు కోచ్‌లు కీలకంగా మారనున్నాయి. నగరంలో మెట్రోకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికుల రద్దీ నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మెట్రో స్టేషన్లలో రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక క్యూ లైన్లు భద్రతా సిబ్బందిని పెంచాలని సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మెట్రో రైలు వ్యవస్థను నగరంలోని నలుమూలలకు విస్తరించడం ద్వారా వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. భవిష్యత్తులో నగర జనాభా మరింత పెరిగే అవకాశం ఉన్నందున దానికి తగినట్లుగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తూ నాణ్యమైన ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నాయి. ప్రయాణికులందరూ మెట్రో సేవలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలని కోరారు. హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ప్రజా రవాణా రంగానికి పెద్ద పీట వేస్తూ మెట్రో రెండో దశ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్లాస్టిక్ నోట్లు వచ్చేస్తున్నాయ్..!

**విశాలభారతి, జాతీయం:**

భారతదేశంలో ఆర్థిక రంగం మరో కీలకమైన మైలురాయి వైపు అడుగులు వేస్తోంది. త్వరలోనే ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ఫీల్డ్ ట్రయల్స్ ప్రాతిపదికన ప్రవేశపెట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశంలో కరెన్సీ నోట్లకు సంబంధించి వస్తున్న ఈ కీలక మార్పుల ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. రూ.10, రూ.20 విలువ గల పాలిమర్ నోట్లకు కేంద్రం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఈ రెండు నోట్లను చెరో 100 కోట్ల నోట్ల చొప్పున అంటే మొత్తం 2 బిలియన్ నోట్లు చలామణిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లోని సెక్షన్ 25 కింద ఆర్‌బీఐ బోర్డు ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపించగా తాజాగా ఆమోదం లభించింది. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతే కాగితపు నోట్లతో పాటు వీటిని సైతం సాధారణ చలామణిలోకి తెస్తామని రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ప్లాస్టిక్ నోట్లను చలామణిలోకి తీసుకొస్తున్నప్పటికీ ప్రస్తుతం చలామణిలో ఉన్న పాత కాగితపు నోట్లను ఉపసంహరించే ఉద్దేశం ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రయోగం విజయవంతమైనా మార్కెట్లో పాత కాగితపు నోట్లు, పాలిమర్ నోట్లు రెండూ సమాంతరంగా చలామణిలో ఉంటాయని తెలిపింది. అయితే పాలిమర్ నోట్ల తయారీ ప్రక్రియ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని, ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయో, అందుకు ఎంత ఖర్చు అవుతుందో ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమని ఆర్థిక మంత్రి తన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్ల ముద్రణకు సాంకేతికత భిన్నంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో నకిలీ కరెన్సీ బెడదను నివారించడానికి ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. తక్కువ విలువ కలిగిన నోట్లు ప్రజల మధ్య నిత్యం చేతులు మారుతుంటాయి. దీని వల్ల వాటి ఆయుష్షు వేగంగా తగ్గిపోతుంది. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ పాలిమర్ నోట్ల వైపు మొగ్గు చూపుతోంది. భవిష్యత్తులో ఈ ప్రయోగం సఫలమైతే మరిన్ని ఎక్కువ విలువ కలిగిన నోట్లను కూడా ఈ విధానంలో ముద్రించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణ కాగితపు నోట్లు నీరు, చెమట, నలిగిపోవడం వల్ల త్వరగా చిరిగిపోవడం లేదా మురికిగా మారిపోవడం జరుగుతోంది. కానీ పాలిమర్ నోట్లు 2.5 నుంచి 4 రెట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. రూ.10, రూ.20 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లు చేతులు మారే వేగం చాలా ఎక్కువ. పాలిమర్ నోట్లు సింథటిక్ ప్లాస్టిక్ మెటీరియల్ తో తయారు కావడం వల్ల నీటిలో తడిచినా లేదా మురికి పట్టినా పాడవ్వవు. పాలిమర్ నోట్లలో ప్రత్యేకమైన పారదర్శక విండోలు, సంక్లిష్టమైన సెక్యూరిటీ ఫీచర్లను చేర్చవచ్చు. దీంతో నకిలీ నోట్లను ముద్రించడం దాదాపు అసాధ్యంగా చెప్పవచ్చు. ఆర్థిక వ్యవస్థ భద్రత దృష్ట్యా నకిలీ నోట్ల ఏరివేత చాలా ముఖ్యం. ఈ కొత్త పాలిమర్ నోట్లలో పొందుపరిచే అధునాతన భద్రతా ప్రమాణాలు నకిలీల తయారీదారులకు పెద్ద సవాలుగా మారుతాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో కరెన్సీ నోట్లలో కూడా ఆధునిక మార్పులు అవసరం. ప్రజలందరూ ఈ కొత్త రకం ప్లాస్టిక్ నోట్లను సులభంగా గుర్తించేలా ప్రత్యేక డిజైన్లను రూపొందిస్తున్నారు. మన్నిక పరంగా చూస్తే ఈ నోట్లు ప్రభుత్వానికి ఆర్థికంగా కూడా దీర్ఘకాలంలో లాభదాయకంగా మారుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రవేశపెడుతున్న ఈ ప్లాస్టిక్ నోట్ల ప్రయోగం విజయవంతం కావడానికి కొంత సమయం పట్టవచ్చు. క్షేత్రస్థాయిలో ప్రజల నుండి వస్తున్న స్పందనను ఆర్‌బీఐ నిశితంగా పరిశీలిస్తుంది. నగరాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకు అన్ని వర్గాల ప్రజల మధ్య ఈ నోట్ల చలామణి ఎలా ఉంటుందో అంచనా వేస్తారు. వాతావరణ పరిస్థితులు, వేడి, తేమ వంటి అంశాలు ఈ పాలిమర్ నోట్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో పరీక్షించడమే ఈ ఫీల్డ్ ట్రయల్స్ ముఖ్య ఉద్దేశం. ప్రజల చేతుల్లో తిరిగేటప్పుడు ఇవి ఎంతవరకు మన్నికను ప్రదర్శిస్తాయనే దానిపై పూర్తి స్థాయి నివేదికను తయారు చేస్తారు. ఈ నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో ముద్రణ శైలిని మరింత విస్తృతం చేస్తారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కరెన్సీ భద్రత చాలా కీలకమైన అంశం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ సంయుక్తంగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమైనదిగా నిలవనుంది. డిజిటల్ లావాదేవీలు ఎంత వేగంగా పెరుగుతున్నప్పటికీ భౌతిక నగదు చెలామణికి కూడా తగిన ప్రాధాన్యత ఉంది. అందుకే భౌతిక నోట్ల నాణ్యతను పెంచే దిశగా ఈ అడుగు పడింది. తద్వారా దేశ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన కరెన్సీ నోట్లు అందుబాటులోకి రానున్నాయి.



# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో నిషేధిత ఆస్తుల పీఓబీ అలాగే 22 ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా న్యాయం చేస్తామని ఆయన భరోసా కల్పించారు. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఇరవై రెండు ఏ మరియు పీఓబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో ఆయన ఒక కీలకమైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ జాబితాకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులపై సుదీర్ఘంగా చర్చించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. గతంలో ఎదురైన ఇబ్బందులను తొలగించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను మాత్రమే తాము క్రమంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూ సేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల పదో నాలుగో తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను కూడా సులభంగా పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగం వేగంగా పనిచేస్తోందని చెప్పారు. ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన గట్టిగా సూచించారు. రైతులు అలాగే సాధారణ ప్రజలు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే నేరుగా అన్ని సేవలను పారదర్శకంగా అందిస్తుందని ఆయన వెల్లడించారు. ఇలా చేయడం ద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి చక్కటి అవకాశం ఉంటుందని చెప్పారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా చూసేందుకు సబ్ రిజిస్ట్రార్‌కు అనుమతి ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది జెన్యూన్, ఏది కాదనే వంటి వాటిని నిశితంగా గుర్తించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని



ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన జిల్లాల పరిధిలో ఉన్న భూ వివాదాలపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూనే, ప్రైవేటు వ్యక్తుల హక్కులకు భంగం కలగకుండా చూసేందుకు తగిన విధివిధానాలను రూపొందించామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల స్థలాలు అలాగే ఇతర భూ సంబంధిత హక్కుల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకతతో రెవెన్యూ సేవలు అందేలా చూడాలని హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న నాల్గు జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని సమస్యలను మంత్రికి వివరించారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తుల వివరాలను, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్లు మంత్రికి హామీ ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగిల్ విండో పద్ధతిలో సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖలో ప్రక్షాళన జరిగితేనే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుందని మంత్రి ఈ సందర్భంగా మరోసారి నొక్కి చెప్పారు. అధికారుల బాధ్యతారహిత్య ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణల వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కామం లభిస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆందోళన చెందకుండా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించే సమయంలో అత్యంత మానవీయ కోణంలో ఆలోచించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాధనం అలాగే ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం ముగిసిన అనంతరం రెవెన్యూ శాఖ ప్రముఖ అధికారులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# రూ. 200 కోట్ల భూమి.. రేవంత్ తమ్ముడికి రూ. 7 కోట్లకే!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువు సంధ్య లేని అనుముల అన్నదమ్ములు కోట్లు సూట్లు వేసుకుంటూ కొత్త దందాలకు తెరలేపారని తీవ్రంగా ధ్వజమెత్తారు. అనుముల కొండల్ రెడ్డి చైర్మన్‌గా ఉన్న టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ అనే దొంగ కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 7 కోట్లకే రేవంత్ రెడ్డి రాసిచ్చాడని కేటీఆర్ తెలిపారు. మన్నె క్రిశాంక్ సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన ఈ కంపెనీ బండారాన్ని బయటపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఎనుముల కొండల్ రెడ్డి రేవంత్ రెడ్డికి తమ్ముడు అవుతాడని ఆయన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో టెసరాక్ట్ కంపెనీకి చైర్మన్‌గా ఉన్నానని స్పష్టంగా రాశారని పేర్కొన్నారు. టెసరాక్ట్ అడ్వాన్స్ సిస్టమ్‌స్‌కు భూపాల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌స్‌కు తాను బాధ్యుడిని అని కొండల్ రెడ్డి స్వయంగా చెప్పాడని కేటీఆర్ ఆధారాలతో సహా వివరించారు. టెసరాక్ట్ సంస్థ ఏర్పాటు చేసిన ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ కంపెనీ కార్యక్రమానికి అమెరికన్ కాన్సుల్ జనరల్ కూడా హాజరయ్యారని కేటీఆర్ వెల్లడించారు. కొండల్ రెడ్డి ఏం చదువుకున్నాడో తనకు తెలియదు కానీ సడెన్‌గా యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెసరాక్ట్ చైర్మన్‌గా ఆయన జాయిన్ అయ్యాడని లింక్డ్ఇన్‌లో పెట్టుకున్నారని చెప్పారు. యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కూడా టెసరాక్ట్ అడ్వాన్స్ సిస్టమ్స్ చైర్మన్ అనుముల కొండల్ రెడ్డిని ఆహ్వానించడానికి సంతోషిస్తున్నామని స్టేట్‌మెంట్ ఇచ్చిందని తెలిపారు. చదువు సంధ్య లేని అనుముల అన్నదమ్ములు కోట్లు బూట్లు వేసుకుని ఇంత పెద్ద కంపెనీలకు చైర్మన్లు ఎట్లా అయిపోతున్నారని తీవ్రంగా ప్రశ్నించారు. ఎవరి కంపెనీ ఏంటిది అని ఆరా తీస్తే టెసరాక్ట్ అడ్వాన్స్ సిస్టమ్స్ కంపెనీ వెబ్‌సైట్ చూశామని అన్నారు. ఆ కంపెనీ ఫోన్




నంబర్ చూస్తే 12345678 అని ఉందని ఇలాంటి నంబర్లు ఉండొచ్చని తమకు తెలియదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ కంపెనీకి ఒక్క ఉద్యోగి కూడా లేదని 2025 మార్చి 31 నాటికి ఎంతమంది ఉద్యోగులున్నారంటే ఒక్కరు కూడా లేరని వాళ్లే చెప్పారని కేటీఆర్ తెలిపారు. ఎక్కడుంది కంపెనీ అంటే ఎక్కడో పటాన్‌చెరులో ఒక చిన్న ఇల్లు అడ్రస్ పెట్టుకున్నారని వివరించారు. కంపెనీ పెట్టినప్పుడు మూలధనం రూ. లక్ష అని పెయిడ్ ఆఫ్ క్యాపిటల్ లక్ష రూపాయలు మాత్రమేనని ఒకే ఒక్కడు కూడా ఉద్యోగి లేదని పేర్కొన్నారు. చైర్మన్ ఎవరంటే అనుముల కొండల్ రెడ్డి అని దీనికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని ఈ లక్ష రూపాయల మూలధనం ఉన్న కంపెనీకి కేటాయించి అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిందని కేటీఆర్ ఆరోపించారు. ఇది మొదటిది కాదు కొండల్ రెడ్డి వ్యవహారమని రేవంత్ రెడ్డికి అనుముల జగదీశ్ రెడ్డి అనే ఇంకో బ్రదర్ కూడా ఉన్నాడని చెప్పారు. ఆయన అమెరికాలో ఉంటాడని సీఎం అమెరికా పర్యటనకు వెళితే రేవంత్ జగదీశ్ కలిసి వెయ్యి కోట్ల రూపాయలకు ఒప్పందాలు చేసుకుని స్వచ్ఛ బయోతో ఫొటో దిగారని తెలిపారు. వాళ్లకు ఎక్కడ భూమి ఇచ్చారో తవ్వి తీయాలని మోడీ ప్రభుత్వంతో కలిసి రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డికి రూ. 1137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్ ఇచ్చాడని కేటీఆర్ విమర్శించారు. సింగరేణిలో వేల కోట్ల కుంభకోణాలు సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతున్నాయని అనుముల కొండల్ రెడ్డికి చెందిన టెసెరాక్ట్ కంపెనీలో ఒక్క ఉద్యోగి లేడు ఆఫీస్ అడ్రస్ లేదు కానీ సుమారు రూ. 200 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కేవలం రూ. 7 కోట్లకు రేవంత్ రెడ్డి రాసిచ్చాడని ఆరోపించారు. ఇది స్కామా కాదా అని తేలాలని కర్ణాటకలో సీఎం సతీమణికి ఆనాడు మూడు ఎకరాల స్థలమిస్తే ఆ సీఎం రాజీనామా చేసే పరిస్థితి వచ్చిందని గుర్తుచేశారు. ఈ అంశాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. అసలు నీ శాఖలో ఏం జరుగుతుందో నీకు తెలుసా శ్రీధర్ బాబు అని కేటీఆర్ నిలదీశారు. బహిరంగంగా టెసరాక్ట్ కంపెనీ చైర్మన్ నేనే అని కొండల్ రెడ్డి ప్రచారం చేసుకుంటుంటే రేవంత్ రెడ్డి సోదరుడికి దీనికి సంబంధం లేదని శ్రీధర్ బాబు సిగ్గులేకుండా బుకాయిస్తున్నాడని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అసలు నీ శాఖలో ఏం జరుగుతుందో నీకు తెలుసా లేక రేవంత్ రెడ్డి నుండి స్క్రిప్ట్ రాగానే బలవంతంగా అదే మాట్లాడుతున్నావా శ్రీధర్ బాబు అని కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని ప్రజల ముందు ప్రభుత్వం అన్ని విషయాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల దోపిడీపై బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రజాధనాన్ని ఇలాంటి దొంగ కంపెనీలకు కట్టబెట్టడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలని లేదంటే ప్రజల నుంచి తీవ్రమైన తిరుగుబాటు తప్పదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు చేస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అవినీతిని అడ్డుకోవాల్సిన ప్రభుత్వమే స్వయంగా కుంభకోణాలకు పాల్పడటం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**విశాలభారతి, జహీరాబాద్**

సంగారెడ్డి జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలోని యూటర్న్ వద్ద కూలీలతో వెళ్తున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వైపు కూలీలను తీసుకెళ్తున్న ఆటోను.. హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ యూటర్న్ వద్ద ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఢీకొన్న వేగానికి ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతులను కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందిన కూలీలుగా గుర్తించారు. ప్రతిరోజూ కూలీ పనుల కోసం రాజగిరి, పరిసర ప్రాంతాల నుంచి జహీరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు పలువురు కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం వెంకటాపూర్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌పై నుంచి ఎగిరి అవతలి వైపు పడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న నాలుగు వాహనాలను ఢీకొనడంతో అవి ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగరంలోని కోకాపేటలో ట్రంప్ టవర్స్ నిర్మాణం కోసం రంగం సిద్ధమైంది. గోల్డెన్ మైల్ రోడ్డులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 65 అంతస్తులతో రెండు అత్యాధునిక ట్విన్ టవర్లను నిర్మించనున్నారు. అమెరికాకు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, స్థానిక ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపడుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరో స్థాయికి చేరనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ టవర్లు నగరానికి మరింత గుర్తింపు తెస్తాయి. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. సుందరమైన పరిసరాల మధ్య ఈ నిర్మాణం సాగుతుంది. నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టు వివరాలు అందరిని ఆకర్షిస్తున్నాయి. ఇరు దేశాల భాగస్వామ్యంతో ఈ నిర్మాణం వేగంగా సాగుతుంది. అన్ని అనుమతులు లభించడంతో పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. రాబోయే కాలంలో ఈ నిర్మాణం పూర్తి కానుంది. ఈ ట్విన్ టవర్స్‌లో మొత్తం 450 అల్ట్రా లగ్జరీ ఫ్లాట్లు అందుబాటులోకి వస్తాయి. మూడున్నర బీహెచ్‌కే, నాలుగు బీహెచ్‌కే, స్కై డుప్లెక్స్ వంటి విభాగాల్లో ఈ నివాసాలు ఉంటాయి. గ్లాస్ ఫసాడ్, స్మార్ట్ హోమ్ టెక్నాలజీ, ప్రైవేట్ వ్యూయింగ్ డెక్స్ వంటి ఆధునిక సదుపాయాలు ఈ ప్రాజెక్ట్‌లో ఉండనున్నాయి. రెండు టవర్లను కలుపుతూ ప్రత్యేకంగా నిర్మించనున్న స్కై బ్రిడ్జ్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ట్రంప్ టవర్స్ ఎత్తు సుమారు 240 మీటర్లు ఉండనున్నట్లు డెవలపర్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలోని అత్యంత ఎత్తయిన రెసిడెన్షియల్ టవర్లలో ఇవి నిలుస్తాయి. భారతదేశంలో ట్రంప్ బ్రాండ్ కింద వస్తున్న ఎత్తయిన ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తింపు పొందుతుంది. ఒక్కో ఫ్లాట్ ధర సుమారు 500 కోట్ల రూపాయల నుంచి ప్రారంభం కానుంది. సామాన్య ప్రజలకు ఇది అందుబాటులో ఉండదు. కేవలం అత్యున్నత వర్గాల వారి కోసమే ఈ అపార్ట్‌మెంట్లు ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. ప్రతి ఫ్లాట్‌లో విశాలమైన గదులు ఉంటాయి. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 16 పెంట్‌హౌస్‌లు ఉండగా వాటిలో ఇప్పటికే ఎనిమిది విక్రయించారు. ట్రిబెకా డెవలపర్స్ ఫౌండర్ కల్పేశ్ మెహతా ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. ఒక పెంట్‌హౌస్ గరిష్ఠంగా సుమారు 62 కోట్ల రూపాయలకు అమ్ముడైంది. భూమి విలువను మినహాయిస్తే ప్రాజెక్ట్ నిర్మాణానికి సుమారు 1500 కోట్ల నుంచి 1800 కోట్ల వరకు వ్యయం కావచ్చు. మొత్తం విక్రయాల ద్వారా 3500 కోట్ల నుంచి 4200 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. డెవలపర్లు ఈ విధంగా భారీ లాభాలను అంచనా వేస్తున్నారు. ఆర్థిక పరమైన లెక్కలు అన్నీ చాలా స్పష్టంగా ఉన్నాయి. వ్యాపార రంగంలో ఇది ఒక సరికొత్త రికార్డుగా మారుతుంది. పెట్టుబడిదారులు దీనిపై తీవ్రమైన ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్తులో దీని విలువ మరింత పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక నిపుణులు ఈ ప్రాజెక్టును ప్రశంసిస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత మూడు ఏళ్లలో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కోకాపేటలో ఇప్పటికే వాణిజ్య నివాస ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయి. ట్రంప్ టవర్స్ రాకతో ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది. ఔటర్ రింగ్ రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు సులభమైన కనెక్టివిటీ ఉంది. ఇది కోకాపేటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ట్విన్ టవర్లు హైదరాబాద్ లగ్జరీ మార్కెట్‌లో కొత్త బెంచ్‌మార్క్‌గా నిలుస్తాయి. దేశంలోని పలు నగరాల్లో ప్రాజెక్టులు




చేపట్టిన ట్రిబెకా సంస్థకు ఇది ప్రత్యేకమైన అడుగు. టీరెరా అనుమతులు లభించిన నేపథ్యంలో తదుపరి దశలో పనులు వేగం పుంజుకుంటాయి. అధికారిక లాంచ్ కార్యక్రమాలు త్వరలో నిర్వహిస్తారు. నగర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరు. అనుభవజ్ఞులైన ఇంజనీర్లు దీనిని పర్యవేక్షిస్తారు. ఈ ప్రాజెక్టు రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన నిపుణులు ఈ పరిణామాన్ని స్వాగతిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విదేశీ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనులన్నీ జరుగుతాయి. పర్యావరణ హితమైన పద్ధతులను ఈ నిర్మాణంలో పాటిస్తారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలి

**విశాల భారతి గోదావరిఖని**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్.జి 1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ నెల ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, రామగుండం ఏరియా 1 ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమాలకు చేపట్టవలసిన ఏర్పాట్లపై జీఎం డి. లలిత్ కుమార్ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వేడుకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వారి



కుటుంబ సభ్యులు మరియు ఇతర అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు.వేడుకల ప్రాంగణంలో వర్షం నుంచి రక్షణ కల్పించే విధంగా షామియానాలు, సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, అతిథులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తదితరులకు అనుకూలంగా ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసారి వేడుకల్లో ప్రత్యేకంగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని ఎలక్ట్రికల్ విభాగం అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదిక, సౌండ్ సిస్టమ్, లైటింగ్, జాతీయ జెండా ఆవిష్కరణ ప్రాంతం తదితర ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే అతిథులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, పర్సనల్, సేఫ్టీ, హెల్త్, సెక్యూరిటీ, తదితర అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, తమకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీఎం శ్రీ లలిత్ కుమార్ సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రామగుండం ఏరియా 1 ప్రతిష్టను ప్రతిబింబించేలా క్రమశిక్షణతో, వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు.ఈ సమీక్షా సమావేశంలో ఎస్.ఓ.టు జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ రాజాజీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు శ్రీ జితేందర్ సింగ్, శ్రీ రమేష్, డేవిడ్, కర్ణ, ప్రతాప్ గిరిరాజు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ వేణు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, రాజేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీ.ఎం.ఆర్. బియ్యం అప్పగింపులో జాప్యం చేస్తే చర్యలు

- పెండింగ్ స్టాక్‌ను గడువులోగా పూర్తి చేయాలి
- డిఫాల్ట్ మిల్లర్లపై నిబంధనల ప్రకారం చర్యలు
- రైస్ మిల్లర్ల సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలో ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్)ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్‌కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎంఆర్ డెలివరీ పురోగతి, పెండింగ్ స్టాక్, ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగింత, బిల్లులు, డిఫాల్ట్ మిల్లర్లపై చర్యలు తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో సీఎంఆర్ డెలివరీలో వెనుకబడిన మిల్లర్లు తమ వద్ద పెండింగ్‌లో ఉన్న స్టాక్‌ను ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులు సూచించారు. ప్రభుత్వానికి బియ్యం అందజేయడంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత సీజన్లకు సంబంధించిన బకాయిలు, రికవరీలు, డిఫాల్ట్ మిల్లర్ల వివరాలపై కూడా సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు చేపట్టాలని మిల్లర్లను ఆదేశించారు. ఎఫ్‌సీఐకి సంబంధించిన సీఎంఆర్ డెలివరీ, బిల్లుల పరిష్కార ప్రక్రియపై కూడా చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని, జిల్లాలో ధాన్యం సేకరణతో పాటు బియ్యం సరఫరా ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగానికి రైస్ మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పునర్వసు నక్షత్ర వేళ.. సీతారామ మందిరంలో వైభవంగా విశేష పూజలు



**కురవి, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండలో శ్రీ సీతారామ మందిరంలో మంగళవారం స్వామివారి పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. మందిర ప్రధాన అర్చకులు పురోహితులు ఆరిపాక సతీష్ ఆచార్యులు చేతుల మీదుగా వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద మంత్రాల ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## పెట్టుబడి ముందు ఆలోచించండి మోసపోతే 1930కు కాల్ చేయండి




**విశాల భారతి ఎన్‌టీపీసీ:** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా - సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ జ్యోతిక భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లు మాట్లాడుతూ,సోషల్ మీడియా,వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లను నమ్మి రిటైర్మెంట్ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు.నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్, కేవైసీ, పెన్షన్,పీఎఫ్, లాటరీలు,లోన్లు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని,అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వారిని నమ్మరాదని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.అనంతరం రిటైర్డ్ ఉద్యోగులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మారుతి, క్రాంతి,హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ జోస్ స్టీఫెన్,బ్యాంకు అధికారులు,సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నియోజకవర్గంలోని ఆలయ పనులు త్వరగా పూర్తి చేయాలి

**దేవాదాయ ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**విశాల భారతి హైదరాబాద్ :** రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ కోరారు.ఈ మేరకు మంగళవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఆలయాల అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. రామగుండం నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, గట్ల రమేష్ పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**డాక్టర్ గూగులోతు రవి నాయక్**



**మరిపెడ, విశాల భారతి:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సూచించారు.మండలంలోని ఇటుకలగడ్డ తండా గ్రామపంచాయతీ, ఎంజేపీటీబీసీ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ, కేజీబీవీలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.ఇటుకలగడ్డ తండా, ఎంజేపీటీబీసీ పరిధిలో 150 మందికి, కేజీబీవీలో 100 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 250 మందిని పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని డాక్టర్ రవి సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.శిబిరాల్లో డాక్టర్లు స్వామి, కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, ఏఎన్ఎంలు శ్రీదేవి, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొని వైద్య సేవలు అందించారు.



## విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మనో వికాసం సాధించాలి

- విద్యతో పాటు నైపుణ్యాలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలి
- నెల్లికుదురు మండలంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో తనిఖీలు

**మహబూబాబాద్, విశాలభారతి:** విద్యార్థులు చదువులో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మానసికంగా, సామాజికంగా, నైపుణ్యపరంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహా శబరీష్ ఐఏఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లికుదురు మండలంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను అధికారులు తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. వసతి గృహాల్లోని వంట గదులను పరిశీలించి పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, వంట సామగ్రి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు టాలెంట్ పరీక్షలు నిర్వహించాలని, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టడంతో పాటు బడిబాట కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

**సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి**

విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టే చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. అందరికీ విద్య అనే లక్ష్యంతో ప్రతి విద్యార్థి పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే తీవ్ర నష్టాలను విద్యార్థులకు వివరించి, వాటికి దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని తెలిపారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం.**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా తదితర అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ చర్యలను నిరంతరం చేపట్టాలని అన్నారు. వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీయచికిత్స చేయరాదని అధికారులకు సూచించారు.

## గూడూరు మండల సభలో ప్రసంగించిన జిల్లా అధ్యక్షులు



- జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలి
- సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడాలి
- ఇండ్ల స్థలాలు ఇండ్లు సాధించుకోవాలి
- జర్నలిస్టుల సంక్షేమమే టి యు డబ్ల్యూజె (ఐజేయు) ప్రధాన లక్ష్యం

**విశాలభారతి, గూడూరు:** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలనీ, సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడి ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించుకోవాలనీ,జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజె (ఐజేయు) ప్రధాన లక్ష్యం అని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం వట్టెవాగు సమ్మక్క సారలమ్మల వనదేవతల ప్రాగాణంలో టియు డబ్ల్యూజె( ఐజేయు) మండల కమిటీ సమావేశం, సంఘ సభ్యత నమోదు కార్యక్రమం మండల అధ్యక్షులు గుర్రపు యాకాంబ్రం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమాలలో జర్నలిస్టులు కీలక భూమిక పోషించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జర్నలిస్టులకు జర్నలిస్టుల బతుకులు మారలేదన్నారు . జర్నలిస్టులకు జీతభత్యాలు లేకుండా 24 గంటలు నిద్రాహారాలు మాని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ పనిచేస్తున్నారన్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని , జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబానికి మీడియా అకాడమీ నుండి లక్ష రూపాయలు అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు.మృతిచెందిన జర్నలిస్టు భార్యకు రూ, 3వేల పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డ్ అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు నివాస స్థలాలను సంబంధించి పాలసీ ప్రకటించి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు సమస్యల సాధన కోసం జర్నలిస్టులందరూ సమిష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంద న్నారు. జర్నలిస్టుల హక్కులు సాధించేవరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. టి యుడబ్ల్యూజె (ఐజేయు) సభ్యులంతా సమన్వయంతో సమిష్టిగా ఉండాలని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలని సూచించారు. సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవహరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అందరూ ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. సమన్వయంతో పని చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె (ఐజేయు ) జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, మండల అధ్యక్షులు గుర్రపు యాకాంబ్రం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంధసిరి రవి, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( టిడబ్ల్యూజెఏ) జిల్లా అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్, టీయూడబ్ల్యూజె ( ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షులు ఉమగాని మధు, ముక్తవరం సత్యనారాయణ, కోరే పాపయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల రంగ, జిల్లా సహాయ కార్యదర్శి రావూరి ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు పానుగంటి శ్రీనివాస్, కురవి మండల అధ్యక్షులు గుంటి సురేష్, మండల కమిటీ నాయకులు కుందూరు కరుణాకర్ రెడ్డి, కన్నా వెంకటేశ్వర్లు, బూరుగు నవనీత్, బానోతు నరసింహ, భూక్య నరసింహ,రాకేష్,భీమగాని యాదగిరి, సంతోష్, బోడ రాజు, మంతపురపు యాకయ్య, యాకుబ్ పాషా, గందసరి రవీందర్, ఎల్లంకి వెంకటేష్, పానుగంటి అజయ్,భూక్య మోహన్, చాగంటి భీముడు, అర్కాల రాజేందర్, రాయపురం సంపత్, బిక్షపతి,భరత్, శ్రీనివాస్, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా మహబూబాబాద్‌ను తీర్చిదిద్దాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నోడల్ పర్సన్లకు డీఎంహెచ్ఓ సూచన



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచించారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నోడల్ పర్సన్లు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 79 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు చికిత్స, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్యం అందిస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. శరీరంపై మొద్దుబారిన రాగి రంగు మచ్చలు, ఆ మచ్చల వద్ద స్పర్శ లేకపోవడం, మచ్చలపై వెంట్రుకలు లేకపోవడం, చెమట పట్టకపోవడం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనిపిస్తే కుష్ఠు వ్యాధిని అనుమానించాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యాధికారితో పరీక్షలు చేయించాలని సూచించారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్సతో పాటు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ, లక్షణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నోడల్ పర్సన్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుమానిత కేసులను గుర్తించడంలో వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, ప్రతి కేసును నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుర్తించి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమష్టి కృషితో మహబూబాబాద్ జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా ముందంజలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కుష్ఠు వ్యాధి కార్యక్రమ అధికారి డాక్టర్ అర్జున్, డీపీఎంవోలు సతీష్ రెడ్డి, వాలియా, డిప్యూటీ డెమో రాజకుమార్తో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన కుష్ఠు వ్యాధి నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు అండగా.. 30 వేల విలువైన పుస్తకాల వితరణ.

- సొంత ఖర్చులతో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి
- భావితరాల విజ్ఞానానికి పుస్తకాన్ని మించిన సాధనం లేదు




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు చేయూతనందించాలనే ఉద్దేశంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి తన సొంత ఖర్చులతో సుమారు రూ.30 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2, ఎస్ఐ, కానిస్టేబుల్, బ్యాంకింగ్, జూనియర్ లైన్‌మెన్ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు అట్లాస్, ఇండియన్ పాలిటీ, తెలంగాణ చరిత్ర, భారత చరిత్ర తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పుస్తకం మనకు తెలియని ప్రపంచాన్ని పరిచయం చేయడమే కాకుండా మన ఆలోచనలు, నడవడికను సక్రమ మార్గంలో నడిపిస్తుందని అన్నారు. భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం మరొకటి లేదని పేర్కొన్నారు. ప్రతి పాఠకుడికి అవసరమైన పుస్తకం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ వితరణ చేపట్టినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో విజయం సాధించాలని, తద్వారా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు. చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి చేసిన పుస్తకాల వితరణపై గ్రంథాలయ పాఠకులు హర్షం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు జి.విజేందర్, రుద్రారపు వీరేందర్, నరసింగం శ్రీనివాస్, మందుల రఘు, భూలక్ష్మి, యాదమ్మతో పాటు గ్రంథాలయ పాఠకులు గోపాల్, నవీన్, సురేష్, ప్రవల్లిక, జ్యోతి, శారద తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

- పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**విశాల భారతి గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో గోదావరిఖని అశోక్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు మహిళలు,బాలల భద్రత,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులకు గురైతే భయపడకుండా షీ టీమ్ 6303923700కు సమాచారం అందించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 100/112,సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం TSafe యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మల్లేష్, ఉపాధ్యాయులు,షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లేశం

- **పార్టీ బలోపేతానికి, ఓబీసీ సంక్షేమానికి కృషి చేస్తానన్న నూతన బాధ్యుడు**



**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం పంతంగి గ్రామానికి చెందిన చినుకని మల్లేశం యాదవ్‌కు బీజేపీలో కీలక బాధ్యత దక్కింది. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయనను సోమవారం నియమించారు.జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని శ్రీనివాస్ ముదిరాజ్ మల్లేశం యాదవ్‌కు దిశానిర్దేశం చేశారు. అనంతరం మల్లేశం యాదవ్అట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి మల్లేశం యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, ఓబీసీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పంతంగి గ్రామానికి చెందిన నాయకుడికి జిల్లా స్థాయి పదవి రావడంతో స్థానికంగా బీజేపీ కార్యకర్తలు, ఓబీసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మార్పు రావాలి ప్రజా వ్యతిరేక బిజెపి పాలన పోవాలి

- **కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు పరచాలి**
- **నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**




**కురవి విశాల భారతి:** ప్రజా వ్యతిరేక, తిరోగామ విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి పాలన పోవాలి,మార్పు రావాలి అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో కేంద్రంలోని బిజెపి కార్పొరేట్ అనుకూల పాలన నిరసిస్తూ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ను కురవి మండల కేంద్రంలో సుధాకర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ 100 రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తానని, అధికారంలోకి వచ్చిన మోడీ పన్నెండు సంవత్సరాలైనా ధరలు ఆకాశాన్ని అంటాయని, ఎటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రగల్భాలు పలికి యువతకు మొండి చేయి చూపించారని, విద్యా, వైద్యం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాలలో పెట్టి పేద మధ్య తరగతి ప్రజలను అధోగతి పాలు చేశారని, రైతాంగానికి మద్దతు ధర కల్పించక, వ్యవసాయ కూలీల ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, రాజ్యాంగ సంస్థలను జేబు సంస్థలు గా మార్చుకొని ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి బెదిరింపులతో నాయకులను, పార్టీలను ప్రలోభ పరచుకుని అది కారాన్ని కాపాడుకోవడానికి నానా గడ్డి కరుస్తున్న మోడీ పాలనను మార్చాలని దేశంలో మార్పు తీసుకురావడానికి యువత రైతులు కార్మికులు ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. విభజన హామీలైన జాతీయ ప్రాజెక్టు,ఉక్కు పరిశ్రమ, కేంద్ర విద్యాసంస్థలు, ఏర్పాటు చేయకపోవడం తెలంగాణ పట్ల కేంద్ర బిజెపి సవితి తల్లి ప్రేమకు నిదర్శనం అన్నారు. ప్రజా చైతన్య యాత్ర కొరవి అయ్యగారి పెల్లి సూధనపల్లి కందికొండ కొత్తూరు నల్లెల్ల రాజోలు బలపాల గ్రామాలలో జరిగినది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి తురక రమేష్ బుడమ వెంకన్న, బుర్ర సమ్మయ్య, దొంతు రామ్మూర్తి, కన్నె వెంకన్న, బస్వ కొమరయ్య, పోలేపాక వెంకన్న, రవి బొల్లు వెంకన్న బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు చంద్రయ్య అనిల్ జన్ను ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన సదస్సు

- **ఎమ్మెల్యే కు ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానం**
- **బొబ్బిల మురళి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం చైర్మన్**




**చౌటుప్పల్, విశాల భారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడనున్నది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి ఆధ్వర్యంలో ఆహ్వానించడం జరిగింది.అదేవిదంగా భక్తులు, ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటనలో కోరారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పురపాలక సంఘ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ , కో ఆప్షన్ సభ్యులు పస్తం గంగ రాములు, నూతనంగా ఎన్నికైన ధర్మకర్తలు వరకాల రవి గౌడ్,ఆవుల యేసు యాదవ్,దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ నాయక్, బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొననున్నారు.

## వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పెద్ద పోచమ్మకు బోనాల సమర్పణ

**విశాల భారతి, నస్రుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో మంగళవారం ఆషాఢ మాసం సందర్భంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పెద్ద పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్ మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు, నైవేద్యం సమర్పించినట్లు తెలిపారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రాకతో పోచమ్మ ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు, మహిళలు, యువత, కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నియామకపాత్రం అందజేత

**విశాల భారతి,ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఉమ్మడి బాల్కొండ మండల అధ్యక్షునిగా బాల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సూర్య ప్రకాష్, ని మండల అధ్యక్షునిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు టికే.శివప్రసాద్, తెలియజేశారు. మంగళవారం రోజు నియామక పత్రాన్ని విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి వెంకటేష్ నాయక్, సూర్యకి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ నాయక్, మాట్లాడుతూ ఉమ్మడి బాల్కొండ మండలం లో ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా లేని విద్య సంస్థలపై పోరాటం చెయ్యాలని, విద్యార్థుల పక్షాన నిలబడి ఉద్యమం సాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో నిజామాబాద్ జిల్లా కళాశాలల ఇంచార్జ్ ప్రణయ్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు అరవింద్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు

**విశాల భారతి,రామగుండం :** రామగుండం సి. పి ఆదేశాల మేరకు పెద్దపెల్లి షీ టీమ్ వారు, గోదావరిఖని, అశోక్ నగర్ లోని ZPHS హై స్కూల్ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా షీ టీమ్ ఇంచార్జ్ SI లావణ్య మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, pocso యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే అన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ T Safe App వాడాలని తెలిపారు.



# సమస్యను అర్థం చేసుకోవాలే..

- **అప్పుడే పరిష్కారం అవుతుంది.**
- **నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..**
- **ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో చేపట్టిన నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నాలో మాట్లాడిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం**



**ముషీరాబాద్, విశాల భారతి:** పాలకులు ఎవరైనా సరే సమస్యను అర్థం చేసుకోగలిగితేనే సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ మహేందర్ పుట్ట అధ్యక్షతన నిరసన సభ జరిగింది. ఈ సభకు ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తన మద్దతు ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ మహేందర్ పుట్ట మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక భారం లేనటువంటి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి 100% గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీ ని రద్దు చేసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను అందర్నీ స్టేట్ హెల్త్ సొసైటీ లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.జీవో నెంబర్ 60, 1195 ప్రకారం తక్షణమే పెంచిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన సభలో రుక్మద్, నరేష్, డాక్టర్ భరత్, ప్రవీణ్, గౌస్ పాషా, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హరిప్రియ, స్వాతి రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చేయూత ఫించను పథకంను డివిజన్‌లలో విస్తృత అవగాహన కల్పించాలి



**విశాల భారతి గోదావరిఖని**

అర్హత ఉన్న ప్రతి ఒక్కరు చేయూత ఫించను పథకం ద్వారా లబ్ధి పొందేలా డివిజన్ లలో విస్తృత అవగాహన కల్పించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వార్డు అధికారులను కోరారు. చేయూత ఫించను పథకానికి సంబంధించి కొత్తగా ధరఖాస్తులు స్వీకరించడానికి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ అయిన నేపధ్యంలో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులకు ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత కొత్త ఫించన్లకు మార్గం సుగమం అయిన నేపధ్యంలో కార్పొరేటర్ల సమన్వయంతో వాడ వాడలా విస్తృత ప్రచారం చేసి అర్హుల నుండి ధరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు , మరణ ధృవీకరణ పత్రాలు , వైద్య ధృవీకరణ పత్రాలు , ఇతర అవసరమైన డాక్యుమెంట్ లు ఆయా కార్యాలయాలు త్వరితగతిన జారీ చేసేలా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ పరిధిలో ఇప్పటికే 19, 659 మంది చేయూత ఫించను పొందుతుండగా మరో రెండు వేల అరవై ఎనిమిది ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు . ఆ ధరఖాస్తుల విచారణ కూడా వెంటనే పూర్తి చేసి అర్హులను గురించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. పొరపాట్లకు , అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా విచారణ పూర్తి చేయాలని అన్నారు. ఫైలేరియా , డయాలసిస్ బాధితులకు కూడా ఫించన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. స్థానిక ఫైలేరియా , డయాలసిస్ బాధితుల జాబితా చుట్టు ప్రక్కల అన్ని ఆసుపత్రుల నుండి తెప్పించి వారికి అవగాహన కల్పించి అర్హత ఉన్న వారితో ధరఖాస్తు చేయించాలని అన్నారు. అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం వితంతు , ఒంటరి మహిళ , దివ్యాంగులు , చేనేత , గీత కార్మికులు , డయాలసిస్, ఫైలేరియా బాధితులు కొత్త ఫించన్ల మంజూరు కోసం ధరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ధరఖాస్తుతో పాటు అవసరమైన అన్ని పత్రాలు జత పరిచి వార్డు అధికారికి లేదా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. ఆధార్ కార్డు , రేషన్ కార్డు , తాజా ఆదాయ ధృవీకరణ పత్రం ( 202627 ) ప్రతి ధరఖాస్తుతో పాటు విధిగా జత చేయాలని అన్నారు. వితంతువులు భర్త మరణ ధృవీకరణ పత్రం , ఒంటరి మహిళలు విడాకుల పత్రం , దివ్యాంగులు సదరమ్ ధృవీకరణ పత్రం , గీత కార్మికులు కల్లుగీత సొసైటి సభ్యత్వం , ఎక్సయిజ్ శాఖ ధృవీకరణ పత్రం , చేనేత కార్మికులు జౌళి శాఖ ధృవీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , ఫించను విభాగం ఇంచార్జ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ,మండల కార్యవర్గ సమావేశం



**హర్ ఘర్ తిరంగా,బూత్ బలోపేతం,స్థానిక సమస్యలపై తీర్మానాలు**

**చౌటుప్పల్, విశాల భారతి:**

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ మరియు మండల ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం సోమవారం ఎస్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం, బూత్ కమిటీలను క్రియాశీలకం చేయడం లక్ష్యంగా పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.సమావేశంలో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆగస్టు 15 వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలందరూ చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.రాబోయే ఎన్నికల్లో భాగంగా బి.ఎల్.ఎ2 లకు, నాయకులకు తగు సూచనలు, బాధ్యతలు అప్పగించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, స్థానిక యువకులకు ఉద్యోగాలు, రైతు సమస్యలు, మున్సిపాలిటీలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, వంద పడకల ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు, ధర్నాలు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డా. నాగం వర్షిత్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్,మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్,జిల్లా ఉపాధ్యక్షులు సాగా చంద్రశేఖర్ రెడ్డి,ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్,కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల ప్రధాన కార్యదర్శి యాస అశోక్ రెడ్డితో పాటు బూత్ అధ్యక్ష, కార్యదర్శులు మరియు ప్రముఖులు, రమణ గోని శంకరయ్య, పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, టేకుల మంజుల, తంగళ్ళ వెంకటేశం, నందగిరి వెంకటేశం, మహేంద్ర మణి, కైరం కొండ స్వప్న అశోక్, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉబ్బు బిక్షపతి, కడవేరు పాండు, నల్ల అంజయ్య, కంది లక్ష్మారెడ్డి, గడ్డం నరసింహ, బత్తుల జంగయ్య, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, వల్లందాసు మహేష్, బోయ సదానందం, వంగాల రమాకాంత్, బాతరాజు ధనుంజయ, ఊదరి దివ్య, బర్మా నాగరాణి తదితరులు పాల్గొన్నారు.పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఈ నరసింహ చారి



**అడవిదేవులపల్లి విశాల భారతి :** అడవిదేవులపల్లి మండల పరిధిలోని 33/11 కేవీ కొత్తనందికొండ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఎల్‌వీ బ్రేకర్ ఎరెక్షన్ పనులు నిర్వహిస్తున్నందున, బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ నరసింహ చారి ఒక ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం, మధ్యాహ్నం 12:00 గంటల నుండి 2:00 గంటల వరకు కొత్తనందికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు నూతన ఎల్‌వీ బ్రేకర్ ఎరెక్షన్ పనులు ఈ విద్యుత్ నిలిపివేతను గృహ, వాణిజ్య,వ్యవసాయ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు గమనించాలని,పనులు సజావుగా సాగేందుకు అధికారులకు, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.




## లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన సదస్సు

**తల్లి, బిడ్డ ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత అవగాహన, వైద్య సూచనలు**

**చౌటుప్పల్ విశాల భారతి:** తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడే దిశగా లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.మున్సిపాలిటీలోని తంగడపల్లి రోడ్డులో గల కళాశ్రీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి లయన్స్ క్లబ్ చౌటుప్పల సేవ అధ్యక్షులు ఎండి అత్‌హర్ పాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా రీజియన్ చైర్‌పర్సన్ సంజీవరెడ్డి, జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా పాల్గొన్నారు. గర్భిణులకు వైద్య అవగాహన కల్పించేందుకు డాక్టర్ వై. సూర్యశ్రీ, డాక్టర్ ప్రశాంతి రెడ్డి, డాక్టర్ అవ్వరు శ్రీనివాస్ ప్రసాద్ హాజరై విలువైన సూచనలు అందించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని డాక్టర్లు ముఖ్యాంశాలు తెలిపారు.గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు వైద్యుల సూచన మేరకు వాడాలి.శుభ్రమైన తాగునీరు, పోషకాహారం, తగిన విశ్రాంతి, పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరి.అధిక రక్తపోటు, రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి, కాళ్లు చేతులు వాపు, చూపు మసకబారడం, బిడ్డ కదలికలు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.సురక్షిత గర్భధారణ, ఆరోగ్యకరమైన ప్రసవం కోసం కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందించాలి. "ప్రతి గర్భిణి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మనందరి బాధ్యత" అని వైద్యులు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దాచేపల్లి రాజు గుప్తా, కోశాధికారి బత్తిని రఘు, నాంపల్లి రమేష్ గుప్తా, తిరందాసు జగన్నాథ్, కాసుల వెంకటేశం గౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గొప్పగోని లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సిలివేరు మంగయ్య, వనం రాజు, సంపూర్ణ చారి, పోలోజు రాజు, పోలోజు శ్రీనివాస్ చారి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆషాఢ బోనాల సందర్భంగా రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా శంషాబాద్‌లోని గాశిమియాగూడలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆషాఢ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రేణుక ఎల్లమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు.

## భూగర్భ జల సంరక్షణకు ధర్మోజిగూడెంలో జలసిరి శ్రీకారం

- **సర్పంచ్ జువ్వి నర్సింహ్మా ఇంకుడు గుంతకు శంకుస్థాపన**

**చౌటుప్పల్, విశాల భారతి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమానికి చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో బుధవారం శుభారంభం జరిగింది. భూగర్భ జలాలను కాపాడే లక్ష్యంతో గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి సర్పంచ్ జువ్వి నర్సింహ్మా శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వర్షపు నీరు వృధా కాకుండా నేరుగా భూమిలోకి ఇంకేందుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలమట్టాలను పెంచడంలో వీటి పాత్ర కీలకమని అన్నారు. "భూగర్భంలో నీటిమట్టం పెంపొందించడం ఇంకుడు గుంతలతోనే సాధ్యం. మన భవిష్యత్ తరాల కోసం ప్రతి ఇంటి వద్ద, ప్రతి వీధిలో సాధ్యమైనంత వరకు ఇంకుడు గుంతలు నిర్మించాలి" అని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సామిడి సంధ్య, ఐతరాజు శారద, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని మొక్కలు నాటి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



# బాగ్యానగర్ కాలనీలో డోర్ టు డోర్ సేకరణ తనిఖీ

- జయానగర్‌లో దెబ్బతిన్న మ్యాన్‌హోల్ పనుల పరిశీలన
- సమస్యను వాటర్‌బోర్డు దృష్టికి తీసుకెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు

సైబరాబాద్ - విశాల భారతి

ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని పారిశుధ్య పనులను సీఎంసీ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాగ్యానగర్ కాలనీలో సాగుతున్న ఇంటింటి చెత్త సేకరణ తీరును డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి స్వయంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుతో పాటు తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాలనీలో 100 శాతం కవరేజీ సాధించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు.

**ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్..**

మరోవైపు జయానగర్ ప్రాంతంలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌పై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన అధికారులు విరిగిపోయిన మ్యాన్‌హోల్ మూతను పరిశీలించారు.వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా వెంటనే అక్కడ రాళ్లు అమర్చి, ఎర్ర గుడ్డతో బారికేడింగ్ ఏర్పాటు చేశారు.ఈ విషయమై జలమండలి (HMWS&SB) అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు డిసి తెలిపారు. పారిశుధ్య ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్లు జలమండలి సిబ్బందితో సమన్వయం చేసుకుని మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.





## క్యామా మల్లేష్‌కు కేటీఆర్ పరామర్శ

- నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ క్యామా మల్లేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మల్లేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మల్లేష్‌తో కొద్దిసేపు మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి,రాష్ట్ర నాయకులు దాసోజ్ శ్రావణ్, కర్నే ప్రభాకర్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దండెం రాంరెడ్డితో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ






**మొయినాబాద్ ఆగస్టు 11(విశాల భారతి ):** హర్ ఘర్ తిరంగా జాతీయ అభియానంలో భాగంగా బీజేపీ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ర్యాలీ జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాల మధ్య కొనసాగింది.ర్యాలీలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు కుందే గణేష్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర సీనియర్ నాయకుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కావలి శ్రీశైలం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పడమటి మమత మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేశారు. టి. శ్రీనివాస్‌గౌడ్, ఎ. శ్రీనివాస్‌గౌడ్, మోరా నరసింహారెడ్డి, బకారం సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, షాపురం మణిక్యం, ఏర్పుల మైపాల్, షాపురం శ్రీకాంత్, మాదాపురం శ్రీకాంత్, కౌన్సిలర్ కిసాన్, జగపతి, క్యమ పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర, పల్లె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దేశభక్తి చాటాలి**

జాతీయ పతాకం పట్ల గౌరవం, దేశ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్‌యాదవ్, తిరంగా ర్యాలీ అసెంబ్లీ కన్వీనర్ నందకిషోర్, మండల కన్వీనర్ మహేందర్ ముదిరాజ్, కోకన్వీనర్ కోరే రామకృష్ణ సమన్వయం చేశారు.

## ఎల్లమ్మ దీవెనలతో ప్రజలు చల్లగా ఉండాలి

**కల్యాణోత్సవంలో పాల్గొన్న గజ్జి భాస్కర్ యాదవ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి కల్యాణోత్సవంలో తెలంగాణ రాష్ట్ర యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు. దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. ఎంతో ప్రసిద్ధిగాంచిన హయత్‌నగర్ ఎల్లమ్మ తల్లి ఆలయంలో కల్యాణోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లమ్మ తల్లి దీవెనలు, ఆశీస్సులతో హయత్‌నగర్ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవడం సంతోషకరమన్నారు. ఎల్లమ్మ తల్లి కృపతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు క్యాదాస్ సతీష్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు ప్రారంద స్వామి, మాజీ అధ్యక్షులు ఎర్ర రవీందర్, సలహాదారులు జొరల నాగభూషణం, ప్రధాన కార్యదర్శి పిట్టల జంగం ముదిరాజ్, ఉపాధ్యక్షులు దేశం ముత్యం శ్రీకాంత్, పారంద సత్యనారాయణ, దాసర మౌని శ్రీధర్, కార్యదర్శి పరందా అరవింద్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, హయత్‌నగర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు

## చెత్త వేరు.. పర్యావరణానికి మేలు




- మొయినాబాద్‌లో తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ
- జీరో వేస్ట్ వార్డుల ఏర్పాటుపై మున్సిపల్ సిబ్బందికి అవగాహన

**మొయినాబాద్ ఆగస్టు 11విశాలభారతి:** తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం ద్వారా పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (CDMA) ఆదేశాల మేరకు మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీలో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.తడి వ్యర్థాలుగా కూరగాయలు, పండ్ల అవశేషాలు, ఆహార వ్యర్థాలు, పూలు, ఆకులు, గడ్డిని గుర్తించి వాటితో కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, బయోగ్యాస్ తయారీ విధానాలను వివరించారు. పొడి వ్యర్థాలైన కాగితం, ప్లాస్టిక్, గాజు, లోహాలు, కార్డ్‌బోర్డును వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి పొడి వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించాలని అవగాహన కల్పించారు.

**ప్రమాదకర వ్యర్థాలు వేరు చేయాలి**

బ్యాటరీలు, పెయింట్ డబ్బాలు, పురుగుమందుల సీసాలు, ట్యూబ్‌లైట్లు, మందుల అవశేషాలను గృహ ప్రమాదకర వ్యర్థాలుగా గుర్తించి ప్రత్యేకంగా సేకరించి సురక్షితంగా నిర్వీర్యం చేయాలని సూచించారు. డైపర్లు, శానిటరీ న్యాప్‌కిన్లు, కాటన్, బ్యాండేజీలు తదితర శానిటరీ వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా వేరు చేసి సురక్షితంగా పారవేయాల్సిన అవసరాన్ని వివరించారు.

**జీరో వేస్ట్ వార్డులే లక్ష్యం**

ఇంటివద్దే వ్యర్థాలను తడి, పొడి, ప్రమాదకర, శానిటరీ వ్యర్థాలుగా వేరు చేయడం, ఇంటింటి సేకరణలో వర్గీకరణను పాటించడం, కంపోస్టింగ్ విధానాలను అమలు చేయడం, జీరో వేస్ట్ వార్డుల ఏర్పాటుపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల కమిషనర్లు, పారిశుద్ధ్య సిబ్బందితో పాటు అమంగల్, ఇంద్రేశం మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సీడీఓ హేమలత, ఆర్‌పి నసీమా సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.

## పదవి కోసం రాజకీయ పంతమా?

- జక్కిడి కుటుంబాన్ని బద్నాం చేయడం తగదు : శివకుమార్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా బద్నాం చేయడం తగదని ఎల్‌బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్ అన్నారు. గత కొంతకాలంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో నకిలీ కృత్రిమ మేధస్సు ఆధారిత ఆడియోలు, వీడియోలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.మన్సూరాబాద్ డివిజన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ.. జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని రాజకీయంగా అవమానపరిచేందుకు, ఆయన పరువుకు భంగం కలిగించేలా కల్పిత ఆడియోలు, వీడియోలు సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులను కలిసి సహాయ పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

**సామాజిక మాధ్యమాల ప్రచారంపై విచారణ చేయాలి**

జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కులం పేరుతో దూషించారంటూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ధర్నాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని శివకుమార్ ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆడియోలు, వీడియోలు నిజమైనవా? నకిలీవా? అనే విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుడ్డా సత్యనారాయణను మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి నియమించిన విషయం వాస్తవం కాదా అని శివకుమార్ ప్రశ్నించారు. గత 15 సంవత్సరాలుగా ఆయన రాజకీయ, ఆర్థిక ఎదుగుదలలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పాత్ర లేదని చెప్పగలరా అని నిలదీశారు.

**40 ఏళ్ల సేవలను గుర్తించాలి**

జక్కిడి ప్రభాకర్‌రెడ్డి గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని శివకుమార్ తెలిపారు. ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం ఇతరుల మాటలు విని ఆయనపై కేసులు నమోదు చేయాలని కుల సంఘాలతో ఆందోళనలు చేయడం సరికాదన్నారు. చైర్మన్ పదవి కోసం జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా బద్నాం చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన విధంగా స్పందిస్తారని శివకుమార్ హెచ్చరించారు. అదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నగేష్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు బొడిగె స్వామి గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్, సంజు గౌడ్, జాకిర్ తదితరులు పాల్గొన్నారు

## చేయూత పెన్షన్ పథకం దరఖాస్తుల స్వీకరణ



**విశాలభారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రోజు చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, పైలేరియా, డయాలసిస్, గీత కార్మికుల వద్ద నుండి దరఖాస్తులు తీసుకుంటున్నామని తెలిపారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి, టీపిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ చిన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భూపేందర్, జో శ్రీను, నాయకులు శాల ప్రసాద్, సానిటరీ సూపర్వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి తదితరులు పాల్గొన్నారు.

## గదిలో కార్మికుడి విగతజీవి

**ఉరేసుకుని ఆత్మహత్య.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో విషాదం**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో టీ దుకాణంలో పనిచేస్తున్న ఓ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గదిలో విగతజీవిగా కనిపించడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాకు చెందిన పీకే రాజీవన్ అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో గత 18 ఏళ్లుగా సిటీ టీ ప్యాలెస్ టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన బావమరిది విపిన్ ఎంకే (38) గత ఆరేళ్లుగా అదే దుకాణంలో సహాయకుడిగా పనిచేస్తున్నాడు. విపిన్ ప్రతి రెండు నెలలకు ఒకసారి తన స్వగ్రామమైన కేరళకు వెళ్లి తిరిగి వచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో జూలై 1న కేరళకు వెళ్లిన విపిన్ జూలై 31న అబ్దుల్లాపూర్‌మెట్‌కు తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తిగా ఉన్నట్లు ఫిర్యాదుదారు పోలీసులకు తెలిపారు.

**మధ్యాహ్నం బయటకు రాకపోవడంతో..**

మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో విపిన్ తన గదిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన వీరభద్ర అనే వ్యక్తి గదికి వెళ్లి చూడగా విపిన్ ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే విషయాన్ని రాజీవన్‌కు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

## గ్రీన్‌సిటీలో మహిళ అదృశ్యం

**ఇంట్లో చెప్పకుండా వెళ్లిన లక్ష్మి.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్‌సిటీ కాలనీలో మహిళ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన బొర్రాత్ సాయిబాబాకు ఐదుగురు సంతానం ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె లక్ష్మి (38)కి బాలకృష్ణతో వివాహం కాగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలకృష్ణ 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అప్పటి నుంచి లక్ష్మి తన ఇద్దరు కుమారులతో కలిసి తండ్రి ఇంట్లోనే నివసిస్తోంది. ఈ నెల 9న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో లక్ష్మి తండ్రి సాయిబాబా హయత్‌నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఆమె ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య కోరారు.

## ఫార్మాసిటీ భూముల రైతులకు ప్లాట్ల పట్టా డాక్యుమెంట్ల పంపిణీ : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నానక్ నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాలకు సంబంధించిన 387 మంది పట్టా భూమి రైతులకు ప్లాట్ల పట్టా డాక్యుమెంట్లను ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్స్ లో జరిగిన పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా పట్టా డాక్యుమెంట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 3207 మంది లబ్ది దారులు ఉండగా మొదటి విడతలో భాగంగా 387 మంది పట్టా రైతులకు ప్లాట్ల పట్టా డాక్యుమెంట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఫార్మాసిటీ కోసం భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం, ప్లాట్ల కేటాయింపులో భాగంగా ఈ డాక్యుమెంట్ల పంపిణీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత రైతులందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా డాక్యుమెంట్లు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, నాయకులు ఈ సీ శేఖర్ గౌడ్ ,పాండురంగా రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, యాచారం తహశీల్దార్ అయ్యప్ప సర్పంచ్ లు ముచ్చర్ల సుగుణ, చైతన్య , ఝాన్సీ , శ్రీ విద్య, ఉప సర్పంచ్ లిక్కి మధుకర్ రెడ్డి, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

## గ్రామ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే మా లక్ష్యం

**గ్రామ సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** గ్రామ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే మా సంకల్పమని నందివనపర్తి గ్రామ సర్పంచ్ రాయికంటి విజయకుమార్ అన్నారు. యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామ అభివృద్ధిలో భాగంగా, గ్రామంలోని మెయిన్ రోడ్డు ఎంట్రన్స్ వద్ద ఎంతోకాలంగా ఉన్న యూజీడి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా పనులను వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులను గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో కొనసాగిస్తూ, పనుల పురోగతిని గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా యు జి డి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యలను పరిష్కరించి విధంగా, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, త్రాగునీరు, వీధిలైట్లు, మోరీల శుభ్రత, రోడ్ల పరిశుభ్రత లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచవటి కాలనీలో జోనల్ కమిషనర్ పర్యటన

**మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం చూపాలి.. రోడ్లు, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి**

**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండ పంచవటి కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. వార్డు 127 పరిధిలోని పంచవటి కాలనీలో మంగళవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కాలనీ ప్రవేశ ద్వారం వద్ద స్థానికులు ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. కాలనీలో పెరుగుతున్న జనాభా, వాహనాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపరచకుండా కొత్త వాణిజ్య సంస్థలకు అనుమతులు ఇవ్వకూడదని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రోడ్ల సామర్థ్యం, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని వాణిజ్య అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పంచవటి కాలనీలో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, రోడ్లను మెరుగ్గా నిర్వహించాలని కోరారు. అలాగే మర్రిచెట్టు, పంచవటి కాలనీ మీదుగా ఓయూ కాలనీ నుంచి లాంకో సర్కిల్ వరకు ఉన్న రహదారి విస్తరణను పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రాధాన్యతతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ హద్దులకు సంబంధించి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఖచ్చితంగా అమలు చేసి, పంచవటి కాలనీ పరిధిని పరిరక్షించాలని స్థానికులు కోరారు. అదేవిధంగా ట్రైల్స్ నుంచి రోడ్ నంబర్ 10ను కలిపే బాక్స్ డ్రెయిన్-కమ్-రోడ్డు మార్గాన్ని తెరిచి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పంచవటి కాలనీ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిని ఆక్రమణలు, అనధికార వినియోగం నుంచి తక్షణమే రక్షించాలని స్థానికులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులు వివరించిన సమస్యలను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పరిశీలించి, సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ట్రాఫిక్ మౌలిక వసతుల అభివృద్ధి, డ్రెయినేజీ మార్గాల వినియోగం, ప్రభుత్వ భూముల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు కాలపరిమితితో చర్యలు చేపట్టాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## హనుమాన్ ఆలయం వద్ద వంతెనకు కదలిక

**భక్తుల భద్రతకు ఫుట్ఓవర్ బ్రిడ్జి అవసరం.. కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ చామల విజ్ఞప్తి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్దఅంబర్‌పేట్ డివిజన్ - లక్ష్మారెడ్డిపాలెం సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద జాతీయ రహదారి 365పై ఫుట్ఓవర్ వంతెన నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. భక్తులు, పాదచారుల భద్రతతో పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈ వంతెన అత్యవసరమని ఆయన వివరించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 365పై ఉన్న హనుమాన్ ఆలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు, సందర్శకులు వస్తుంటారని ఎంపీ తెలిపారు. సాధారణ రోజులతో పోలిస్తే పర్వదినాలు, పండుగల సమయంలో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందని పేర్కొన్నారు. అయితే ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో రహదారి దాటే సమయంలో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**వాహనాల వేగం.. భక్తుల భద్రతకు ముప్పు**

జాతీయ రహదారిపై నిరంతరం భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో పాదచారులు రహదారి దాటడం ప్రమాదకరంగా మారిందని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక పూజల సమయంలో భక్తుల రద్దీ పెరగడంతో ప్రమాదాల ముప్పు మరింత అధికమవుతోందని తెలిపారు. భక్తులు రహదారిని దాటేందుకు ప్రత్యేకంగా సురక్షిత మార్గం లేకపోవడంతో ఒకవైపు పాదచారులకు ఇబ్బందులు, మరోవైపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో హనుమాన్ ఆలయం వద్ద ఫుట్ఓవర్ వంతెన నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి**

ఫుట్ఓవర్ వంతెన నిర్మాణ ప్రతిపాదనపై తక్షణమే సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వంతెన నిర్మాణం పూర్తయితే హనుమాన్ ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు సురక్షితంగా రహదారి దాటేందుకు అవకాశం కలుగుతుందని, అదే సమయంలో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగుతాయని ఎంపీ తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

## అమ్మవారి కల్యాణానికి పోటెత్తిన భక్తజనం

**భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం**





**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** హయత్‌నగర్ మండల కార్యాలయంలోని శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం మంగళవారం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. హయత్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు క్యాదాస్ సతీష్ మహారాజ్, గౌరవ అధ్యక్షులు పారందస్వామి, మాజీ అధ్యక్షులు ఎర్ర రవీందర్ తోపాటు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పుట్టబంగారం తీసుకువచ్చి, గంగాస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ పూజారి వేదమంత్రాల నడుమ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**

ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షులు క్యాదాసు సతీష్ మహారాజ్, గౌరవ అధ్యక్షులు పారంద స్వామి, మాజీ అధ్యక్షులు ఎర్ర రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హయత్ నగర్ ప్రజా ప్రతినిధులు యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, కొప్పుల విటల్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకులు నక్క రంజిత్ గౌడ్, హయత్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నగౌని రవీందర్ గౌడ్, టిఆర్ఎస్ అధ్యక్షులు చెందగౌని శ్రీధర్ గౌడ్, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు దేశం ముత్యం శ్రీకాంత్, పారంద సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిట్టల జంగం ముదిరాజ్, సలహాదారులు జోరాల నాగభూషణం, డి.శ్రీధర్, పారంద అరవింద్ స్వామి, కార్యవర్గ సభ్యులు ఎర్ర నరసింహ, ఎత్తరి భీమ్‌రాజ్, , వంజరి నరసింహ, మధుసూదన్, శివ ముదిరాజ్ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**విశాలభారతి,హనుమకొండ;** ఈ నెల 16న పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు దిశానిర్దేశం చేశారు. హెలిప్యాడ్, బహిరంగ సభ, డయాస్, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు.

సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఏ మేన శ్రీను, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేతా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తడి–పొడి చెత్త నిర్వహణతో అభివృద్ధి బాటలో అప్పాచిపల్లి

- **గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్న సర్పంచ్ నాగిన్ వెంకట్ గౌడ్**

**విశాలభారతి, కొల్చారం :** మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాచిపల్లి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు గ్రామ సర్పంచ్ నాగిన్ వెంకట్ గౌడ్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలోని మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షిస్తూ, వీధి దీపాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మురికి కాలువల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ అప్పాచిపల్లి గ్రామాన్ని కొల్చారం మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాభివృద్ధితో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు సర్పంచ్ నాగిన్ వెంకట్ గౌడ్ తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

- **అర్హులకు ఫీజు వసూళ్లు**
- **వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలి**
- **శంషాబాద్ జోన్‌లో**

**జోనల్ కమిషనర్ కె. చంద్రకళ సమీక్ష**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**




శంషాబాద్ ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి, అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ప్రొసీడింగ్స్ జారీ చేయాలని జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అమలు, ఫీజుల వసూళ్లు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, అర్హులైన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ జారీ అంశాలపై మంగళవారం శంషాబాద్ జోన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె. చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆదిబట్ల సర్కిల్-15, బడంగ్‌పేట్ సర్కిల్-16, జల్‌పల్లి సర్కిల్-17, శంషాబాద్ సర్కిల్-18 పరిధిలోని వార్డు అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫీజుల చెల్లింపులు, పరిశీలన ప్రక్రియ, ప్రొసీడింగ్స్ జారీ తదితర అంశాలపై అధికారులు వివరాలను సమర్పించారు. ఈ సందర్భంగా కె. చంద్రకళ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వార్డుల వారీగా పరిశీలించి, అర్హత కలిగిన దరఖాస్తుదారుల నుంచి ఎల్ఆర్ఎస్ ఫీజుల చెల్లింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫీజు చెల్లించిన అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్‌ను వీలైనంత త్వరగా జారీ చేయాలని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, సమర్థవంతంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి వార్డులో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేకంగా సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని, వారి సందేహాలు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.ఎస్. మెహ్రా, శంషాబాద్ జోన్‌కు చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అరెస్టులతో అణచివేత ఎందుకు?

**శాంతియుత నిరసనకు ముందస్తు**

**అరెస్టులపై ప్రజా సంఘాల ఆగ్రహం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హైదరాబాద్ ఎల్‌బీనగర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ యువజన రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తండ్రి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం శాంతియుత నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమానికి ముందే పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పలువురు ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని ఆరోపించారు. బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్, తెలంగాణ ప్రదేశ్ ఏరుకుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, బీవైకేఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కందెల వెంకటేశ్వర్లు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్మర్తి శేఖర్, సాగర్, వనం గంగయ్య, గంగయ్య, కుతాడి ముకేష్, కుతాడి శ్వేత, బాలరాజ్, భీమ్రాజ్ తదితరులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని నాయకులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఎల్‌బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ల మీదుగా రామోజీ ఫిల్మ్‌సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు ఆరోపించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఉద్యమ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులను అరెస్టు చేసి, తమ ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

అరెస్టు చేసిన ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని వివిధ ప్రజా, బీసీ, మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై పోలీసులు స్పందించకపోతే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ వద్దకు వందలాది మందితో తరలివచ్చి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరారు.

## మూసీ కోసం మా ఇళ్లు ఇచ్చేదే లేదు!

- **గండిపేటలో మూసీ బాధితుల ఆగ్రహం.. అధికారుల సమావేశంలో రసాభాస**
- **"గో బ్యాక్ ఆఫీసర్స్" అంటూ నినాదాలు.. సమావేశాన్ని బహిష్కరించిన బాధితులు**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**



గండిపేట మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి కోసం తమ ఇళ్లు, స్థలాలను ఇచ్చే ప్రసక్తే లేదని మూసీ పరివాహక ప్రాంత కాలనీలకు చెందిన బాధితులు తేల్చిచెప్పారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలతో రెవెన్యూ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు నిర్వహించిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమావేశానికి ఆర్డీవో, ఎమ్మార్వోలతో పాటు రెవెన్యూ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు హాజరయ్యారు. అధికారులు తమ ఇళ్ల ఖాళీ, భూసేకరణ అంశాలపై మాట్లాడుతుండగా బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాలను పట్టించుకోకుండా ఇళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం సరికాదంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతూ "గో బ్యాక్ ఆఫీసర్స్" అంటూ నినాదాలు చేశారు. తమ ఇళ్లు, స్థలాలు, జీవనాధారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మూసీ అభివృద్ధి పేరుతో తమ కుటుంబాలను రోడ్డున పడేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని హెచ్చరించారు. తమ సమస్యలను పూర్తిగా పరిష్కరించిన తర్వాతే తదుపరి చర్యలపై మాట్లాడాలని, ముందుగా బాధితుల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తమ వాదనను వినకుండా సమావేశం కొనసాగించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహించిన మూసీ బాధితులు అధికారులతో నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చారు. కొంతసేపు సమావేశం ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మూసీ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే తమ ఇళ్లు, భూములను కోల్పోయేలా చేసే చర్యలను మాత్రం అంగీకరించబోమని బాధితులు స్పష్టం చేశారు. తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని, పునరావాసం, పరిహారం తదితర అంశాలపై పూర్తి వివరాలు వెల్లడించిన తర్వాతే ముందుకు వెళ్లాలని బాధితులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పట్టించుకోకుండా ఇళ్ల ఖాళీకి చర్యలు చేపడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజాబాటలో విద్యుత్ అంతరాయాలకు చెక్.. తానిషా కాలనీలో చెట్ల కొమ్మల తొలగింపు

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా 127-మణికొండ డివిజన్‌లోని తానిషా (హుడా) కాలనీలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ డీఈ రమేష్ చంద్ర, ఏఈడీఈ సైదులు, ఏఈ సంతోష్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది తానిషా కాలనీలో పర్యటించి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గుర్తించి తొలగించారు. వర్షాలు, గాలుల సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకడం వల్ల సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చేపడుతున్న ముందస్తు చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపడమే 'ప్రజాబాట' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తానిషా కాలనీ వాసులు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వల్ల విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ నుమాన్, తానిషా కాలనీ సొసైటీ అధ్యక్షులు సీతారామదాస్, కార్యవర్గ సభ్యులు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షులు వంశీ తదితరులు పాల్గొన్నారు. కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలు, అలాగే ఇతర సమస్యలను అధికారులు గుర్తించి ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.



## ఆధునిక, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

**యాచారం ఏవో రవినాథ్**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని చౌదరిపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి మరియు సేంద్రీయ వ్యవసాయం, ఎలి నినో ప్రభావం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రవినాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ మార్పులు, ముఖ్యంగా 'ఎలి నినో' ప్రభావం వ్యవసాయంపై చూపే నష్టాలను రైతులకు వివరిస్తూ, వీటిని తట్టుకోవడానికి ఆరుతడి పంటల సాగు ఎంతో మేలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చౌదరిపల్లి, తులేకుర్దు గ్రామ సర్పంచులు, స్థానిక అభ్యుదయ రైతులతో శాస్త్రవేత్తలు సమావేశమై, ప్రస్తుతం గ్రామాల్లో సాగవుతున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు మేలు చేకూర్చే పలు కీలక అంశాలైన రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయం, ఒకే భూమిలో బహుళ ఆదాయ వనరుల కోసం మిశ్రమ పంటల సాగు, కూరగాయలు, పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. వీటితో పాటు వ్యవసాయానికి అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకాన్ని చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎలా స్థిరపడవచ్చో వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌదరిపల్లి క్లస్టర్ పరిధిలోని గ్రామ ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, క్లస్టర్ పరిధిలోని రైతులు మరియు అభ్యుదయ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరంగాతో హయత్‌నగర్ హోరెత్తింది

**దేశభక్తి నినాదాలతో సాగిన ర్యాలీ.. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో కదిలిన బీజేపీ శ్రేణులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో హయత్‌నగర్‌లో దేశభక్తి వెల్లివిరిసింది. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో హయత్‌నగర్ ప్రధాన రహదారులు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. హయత్‌నగర్ మదర్ డైరీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ హయత్‌నగర్ ప్రధాన రహదారి మీదుగా బావర్చి వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు జాతీయ జెండాలను చేతబూని దేశ సమైక్యత, సార్వభౌమత్వం, జాతీయ స్ఫూర్తిని చాటారు. యువత ఉత్సాహంగా పాల్గొనడంతో ర్యాలీ సందడిగా సాగింది.

**జాతీయ స్ఫూర్తిని చాటిన నాయకులు, కార్యకర్తలు**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్, ఎల్.బి.నగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సాయిరాం గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందచారితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

## పెరిగిన ధరల ప్రకారమే రైతులకు న్యాయం చేయాలి

**మొండి గౌరెల్లి లో రైతుల ఏకగ్రీవ తీర్మానం**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వం సేకరించ తలపెట్టిన భూములకు సంబంధించి యాచారం మండలం పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ ప్రజలు, రైతులతో భారీ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూసేకరణ వల్ల రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా త్వరలోనే స్థానిక ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బాధితులు పలు ప్రధాన డిమాండ్లను తెరపైకి తెచ్చారు. పెరిగిన మార్కెట్ విలువల ప్రకారం రైతులకు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రికార్డుల ప్రకారమే కాకుండా, ప్రస్తుతం రైతుల కబ్జాలో ఉన్న పూర్తి విస్తీర్ణానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గతంలో స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చిన అదనపు ప్లాటు విషయమై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని నిలదీశారు. వివాదాస్పదంగా మారిన 19, 68, 127 మూడు సర్వే నెంబర్లకు విడివిడిగా కాకుండా, ఒకేసారి అవార్డు పాస్ చేసి పరిహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ఆయా సర్వే నెంబర్ల పరిధిలోని బాధిత రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు.





## ప్రభాస్‌తో పోటీకి వస్తున్న

# 'సాహో' బ్యూటీ..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ పీరియాడిక్ వార్ మూవీ 'ఫౌజీ' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3, 2026న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. పాన్ ఇండియా భాషల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేయనున్నారు. అయితే, ప్రభాస్‌తో పోటీ పడేందుకు ఆయన నటించిన 'సాహో' మూవీ బ్యూటీ రెడీ అవుతుంది. బాలీవుడ్ స్టార్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ప్రస్తుతం చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తుంది. ఆమె నటిస్తున్న 'ఈఠ' చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే, ఈ చిత్రాన్ని తొలుత ఆగస్టు 14న రిలీజ్ చేయాలని మేకర్స్ భావించారు. కానీ, యష్ 'టాక్సిక్'తో క్లాష్ నివారించేందుకు ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక 'ఈఠ' చిత్రాన్ని డిసెంబర్ 4న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దీంతో ప్రభాస్ 'ఫౌజీ'తో 'ఈఠ' పోటీకి దిగనుంది. ఇంట్రెస్టింగ్ విషయం ఏమిటంటే, ప్రభాస్‌తో కలిసి శ్రద్ధా కపూర్ 'సాహో' చిత్రంలో నటించింది. వీరిద్దరి కాంబినేషన్‌కు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. మరి బాక్సాఫీస్ దగ్గర ఇప్పుడు ఈ ఇద్దరు పోటీ పడుతుండటంతో బాక్సాఫీస్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.